# మధుబాల

ప్రథమ ముద్రణ 1952

బోయి భీమన్న

దేశి కవితా మండలి
విజయవాడ – 2

దేశి ప్రచురణ

ప్రథమ ముద్రణ

ఏప్రియల్ - 52

భారత ముద్రణాలయం

.............విజయవాడ

సంపాదకులు

బొందలపాటి శకుంతలాదేవి

శివరామకృష్ణ

మా భీమన్న కవి హృదయం మెత్తన; ఆయన కవిత్వం మెత్తన
ఆయన బ్రతుకువలె పాటకూడ ఉన్నతాశయ ప్రేరితం.

మద్రాసు

28-5-1952

నార్ల వెంకటేశ్వరరావు
(ఆంధ్రప్రభ ఎడిటర్)

## ఆశీస్సు

నవ్య సాహిత్యారామమున నవనవోన్మేషితమై, మనోహర రచనా సౌరభ్యముగల కావ్య కుసుమములలో "మధుబాల" యొకటి.

ఈ కృతికర్త భీమన జాతీయ కవి. "జానపదుని జాబు"లతో గ్రామీణ జీవితమును దిద్ది, "పాలేరు"న పాలనా విధాన మూహించి జాతియందలి "అసూయా" మాలిన్యమును తొలగించి, కూలీని "రాజు"గా చేసిన సిద్ధహస్తుడు భీమన కవి.

మధుబాలయందు నొక రాజకీయ సంఘటనము గల్పించి, నూతన స్వాతంత్ర్య వాతావరణమున నవభారతాభ్యుదయము నిరూపించినాడు.

ఇది శృంగార వీర రస ప్రధానమగు కావ్యము, ప్రాచీనాలంకారిక సూక్తి ననుసరించి నది. అపూర్వ భావములతో, నద్భుత ప్రకృతి రామణీయకములతో, నసమాన కవితాశిల్పము నిది యందుకున్నది.

నాయికా నాయకుల పరస్పర జీవిత సంఘటనలు, ప్రణయరీతులు, నారు శీర్షిక లలో నిందభివర్ణితములైనవి. ఇందలి ఛందస్సు మంజరీ ద్విపదకు సన్నిహితముగ గేయ రూపమున నుండుట విశేషము.

ప్రజలకు "స్వాతంత్ర్య దీక్ష నొసంగుట కొరకు, స్వారాజ్య మొక్కటి సాధించు కొరకు" ఇందలి నాయికా నాయకులు, మధుబాలా గౌతములు, అజ్ఞాత (అరణ్య) వాసము నుండి విమలచిత్తములతో మానవ లోకములోనికి బ్రవేశించినారు. వారి ప్రవేశము భారత భావిభాగ్యో దయము.

ఉన్నత భావములతో, ఉదారాశయములతో, ఉత్తేజకర సందేశములతో కవితా గాన మొనర్చిన భీమ కవి "మధుబాల" కృతి ఆంధ్రలోకమునకే గాక మహనీయ విద్వల్లోకమున కెల్ల మాననీయము. ఇందలి కథా వస్తువు, భాష, భావములు త్రికరణశుద్ధిగా దేశాభ్యుదయ హేతువులగుటచే ఈ కావ్యము దేశమునందంతటను ప్రచారము గాంచదగినది.

సర్వమానవ సౌభ్రాత్రవము, స్వాతంత్ర్య దీక్ష, శాశ్వతాభ్యుదయము పెంపొందించునిట్టి కృతిని రచించిన భీమన కవిని మనఃపూర్వకముగా నభినందించుచున్నాను. సాహితీ ప్రపంచ మున "మధుబాల" మధు రసస్యందియై బహుళ ప్రచారముగాంచు గావత! భీమన కవి యింకను నిట్టి గ్రంథములు పెద్దగ రచించి, పేరు మ్రోసి, తెనుగుతల్లి యశస్సు దిగంతముల వ్యాప్తిచేయుదురు గాక!

మద్రాసు
13-5-1952

విద్యారత్న
నిడదవోలు వెంకటరావు ఎమ్.ఏ.

## అభ్యర్థన

శిల్పి తన కళను వ్యక్తపరచడానికి సాధనంగా ఏ రాతినైనా తీసుకోవచ్చు; లోహాన్నో, కొయ్యనో, మట్టినో తీసుకోవచ్చు. దర్శన మాత్రంచే రసానుభూతిని కలిగించే శిల్పానికి వస్తు ప్రాధాన్యం లేదు. ఈ సూత్రమే ఆయా రంగాలలో సంగీత సాహిత్యాది కళలన్నిటికీ వర్తిస్తుంది.

ఈ దృక్పథంతోనే నేను ఈ "మధుబాల"ను సృష్టించాను. రచన ఉప్పుసత్యాగ్రహం రోజుల నాటిది. కావ్యవస్తువు ఆనాటి రాజకీయాలకు చెందినట్టిది. కథ కేవలం కల్పితం. స్వాతంత్ర్యోద్యమంలో దేశం ఉద్రూతలూగిన ఆ రోజుల్లో - బహుశా - ఇది నా పగటికల, తీరని కోరిక.

ఈ కావ్యాన్ని 1933 ప్రాంతంలో వ్రాశాను. 1950లో పరిష్కరించాను. అయినా, చేసినవి - సర్వజన సమత్వాన్ని "సర్వోదయ" అనడంవంటి కొద్దిపాటి మార్పులు శబ్ద సంబంధమైన దిద్దుబాట్లు మాత్రం.

ముద్రణ సందర్భంలో అక్కడక్కడ కొన్ని పొరపాట్లు దొర్లాయి. 42, 47, 88 పేజీలలో 1, 2, 1 పద్యాల చివర (") గుర్తులు ఉండాలి. "రాలిపోవు", "ఆడుకొను", "దానిగొరకు" మొదలైనచోట్ల అనవసరంగా అరసున్నాలు పడ్డాయి. 11వ పేజీ రెండవ పద్యంలో "కొమ్మ, విరిగి" అన్నచోట కామా (,) గుర్తు వుండగూడదు. ఇంకా అక్కడక్కడ అక్షరాల తప్పులున్నాయి. వాటిని సహృదయులు గుర్తించగలరు కనుక ప్రత్యేకంగా పేర్కొనడం లేదు. "విశ్వరాట్నం" లాంటి కొన్ని ప్రయోగాలు స్వతంత్రించి చేసినట్టివి.

నాకు గురుతుల్యులు, శ్రేయోభిలాషులు అయిన "ఆంధ్రప్రభ" ఎడిటర్ శ్రీ నార్ల వెంకటేశ్వరరావుగారు; మద్రాసు విశ్వవిద్యాలయ తెలుగు పరిశోధన శాఖ ప్రధానాంధ్రోపన్యా సకులు, విద్యారత్న శ్రీ నిడదవోలు వెంకటరావు ఎమ్.ఏ. గారు, అత్యంతాదరాభిమానాలతో ఈ కావ్యం చదివి, తమ అమూల్యాభిప్రాయాలను ఇచ్చినందుకు వారికి సర్వదా కృతజ్ఞుణ్ణి. ఈ కావ్యం ముద్రితరూపంలో వచ్చేలోగా

పలు దశలలో, పలు విధాలుగా తోడ్పడిన శ్రీ రావి రామనాథరెడ్డి, శ్రీ వేమరాజు భాను మూర్తి, శ్రీ తిరుమల రామచంద్ర వంటి మిత్రులకు నా వందనాలు!

గ్రంథ ప్రచురణలో నాయందు ప్రత్యేకాభిమానం చూపుతూ, వరుసగా నా రచన లను ప్రచురిస్తున్న 'దేశి కవితా మండలి' వ్యవస్థాపకులు శ్రీయుతులు బొరెదల పాటి దంపతులకు ఈ సందర్భంలో అభివందనాలర్పిస్తున్నాను.

పూర్వఛందస్సునే అనుసరించినా, వస్తుభావ వర్ణనాది విషయాలలో అపూర్వంగా ప్రవర్తిల్లిన ఈ "మధుబాల" అభ్యుదయపరులకు ఆనందమివ్వగలదనే భావిస్తున్నాను. ఆదరించవలసిందిగా అభ్యర్థిస్తున్నాను.

మద్రాసు

బోయి భీమన్న

అంకితం

మిత్రులు, మద్రాసు మంత్రి

## శ్రీ డి. సంజీవయ్యగారికి

శ్రీ నివాస మ్మన, శ్రీ చక్ర మనగ,
పారమ్యమౌ నది పద్మాకరమ్ము,
వాణీ వసంత వీణా నాద మనగ
ఆ పరీసరము బ్రహ్మానందకరము.

కంటిపాపను బోలు కాసార మందు
ఇంతగా దీపించు నెవ్వరి హృదియొ!
అద్దమ్మువంటి నవ్యారామ మందు
ఆదర్శ మెవరిదో అందాలు చిందు!

శైవాలినీ ఘనస్వాంతమ్ము నందు
నడుమ పూచిన చిన్ని నలినమ్ము వోలు
పారమ్ము లేని కీకారణ్య మందు
ఈ యాశ్రమమ్మున కెవరు కారణమొ!

పరమ సుషుప్తిలో స్వప్నమ్ము రీతి,
స్వప్న జగత్తులో జాగృతి వోలె,
జాగృతిలో భావసంచార మట్లు
రమణీయ మీతావు రకరకమ్ములుగ.

అమృతపూరములు బాలాతపరచులె
మండించు జగతిని మధ్యాహ్నమందు
జాలిచూపులు చూచు సాయంతనమున?
కర్మకు హేతువు కాలమే యేమొ!

జలజాప్తు వెన్నంటి చనుచున్న రశ్మి
రాత్రిని గడుపగా రమణీరూపమున
నేతెంచిన విధాన నెవరొ యాబాల!
ఏదో వచించు నాపూదీవ తోడ!!

"పూవు గిల్లిన చోట పుట్టెడు బాధ,
మొగ్గ దుంచినచోట ముసరదా యేమి?
మౌనముగా ఘోరమైన యాకడుపు
కోత నేగి నోర్చుకొంటివే, తల్లి?

అమ్మయో! ఈ లేతగొమ్మను విరవ
నే కాలు కదిలెనో, ఎంత నిర్దయయొ!
ముద్దుల మొగ్గను పుడికి పార్వైవ
నేకేలు సాగెనో, ఎంతకర్కశమొ!

ఈ గులాబీ తీగ నెలమితో మేమె
జంటగా ననదేరుకొంటి మన్కొంటి,
ఎవ్వరే, నా కోర్కె నీరీతిత్రుంచి
పార్వైచి, యింత పాపము గట్టుకొనిరి!

ఏమమ్మ, తుమ్మెదా? ఏమమ్మ, పికము?
ఏమమ్మ, వనలక్ష్మి? ఏమిటీ హింస?
నవమోహనముగ గానము జేసి యైన
కరగింపరైతిరి కఠినచిత్తమును?

సౌందర్యమును జూచి సజలమ్ము కాని,
కరుణాగీతము విని కరగి పోలేని
నేత్రమ్ము, గాత్రమ్ము ధాత్రిలో గలుగ
దిక్కేమి నావంటి దీనుల కింక!"

కన్నులత్తుకొని, యా కమనీయ మూర్తి
మీది పూగొమ్మను మృదువుగా వంచి,
అరవిరి ముద్దాడి, అనుకంప మొంది,
ఎవ్వరినో యెంచి ఈరీతి బల్కు:

"ఒక్కక్రొవ్విరి ద్రుంచి, ఒకదాని నుంచి,
క్రూరుడ వనిపించు కొంటి వీ నాడు;
గుత్తుగుత్తును గోసికొని పోవ నీకు
గుండెలు చాలవో, కోరికల్ లేవొ!

తెలివి కందని యో యదృష్టహస్తమ్మ!
మొగ్గలు గిల్లుట మోదమో నీకు?
తీవతల్లి కడుపు తీపిని మాపి
పూవులు పుడికెడు బుద్ధి నీకేల!

ప్రకృతి సౌందర్యమ్ము పాడొనర్చుటకు
మానవు లెవ్వరు మసల రిచ్చోట;
ఆకలి తీరిన యాపైని సుంత
కసవు త్రెంచెడి ప్రాణి కలుగ దిత్తోట.

హేతు వేదైన, నీవెవరైన గాని,
జంట బావుట నీకు సాధ్యమ్ము కాదు;
పూ గొమ్మ నున్నయప్పుడె రెండు గాని,
కొమ్మ పోయిన తోనె కూడవా యొకట?"

ఒక్కటైపోయి, వియోగాగ్ని లోన
నెర్రగా గాలిన హృదయమో యనగ
విచ్చిన రెండవ విరి దున్చి యామె
తొలిసారిగా నేత్రముల కద్దుకొనెను.

ఫుల్లముగా పూచి డుల్లిన పూలె
కాని, ముడువదామె కలికలు కోసి;
కోసిన దీనాడు కొత్తగా పువ్వు,
పువ్వెంతగా పెట్టి పుట్టిన దానొ!

పుప్పొడి రాల్చెనో పుష్పంధయమ్ము,
చరమగీతము పాడె పరభృత మ్మొండు,
క్రొంబూవు కిసలయారుణ హస్తపేటి
సంసిద్ధి పొందిన సందర్భ మందు.

అంత నా హరిణాక్షి అట నుండి కదలి,
ఆలోన గల పర్ణశాలను జచ్చె;
భరతదేశ పటమ్ము భక్తితో గొల్చు
దేవాలయ మ్మది, దివ్యాలయమ్ము!

దేశమాతకు నిరుదేశమ్ము లందు
లక్ష్మీ సరస్వతు లభిషిక్త లైరి,
ముగ్గు రమ్మల పాదముల మొగ్గరమున
పుష్పమ్ము నిడి యామె మోడ్చె హస్తములు.

"ఒక్కటీ ప్రసవమ్ము, ఒక్క తె నేను,
చెలు లెందు పోయిరో తెలియదు మాకు;
పువ్వు పోయిన దారి పువ్వును బోయె,
సఖుడేగిన పథాన సఖియేల చనదు?

సఖి! చేరుకొందు పూజావేళ కంచు
వేకువతోలేచి వెడలె నెచ్చటికో;
జలజమిత్రుడు చేరె జలరాశి దిరిగి,
నా మిత్రుడేలనో ననుజేరలేదు!

విశ్వాలు పాలింప వెడలిన రవియు
అనుకొన్న వేళకు నరుగును మరలి!
నిర్ణీత సమయ నిర్ణిద్రత లేని
చెలి నెచ్చెలుల కెంతొ చింతను గూర్చు

ఆటపాటలు మాని అటవీ శకుంత
కులములు తమతమ గూండ్ల చేరినవి;
చీకటిగదులను జేరి వల్లికలు
విశ్వమ్ము నేమరి విశ్రమించినవి.

చూడరా, ఒకసారి? చూపరా, దారి?
ఏమమ్మ, పరదేవతా మూర్తులార!
నాసఖు నాకుగన్పరచి, లోకముకు
తెలుపుడు పట్టిబొమ్మలము కామంచు"

"సమ్యక్ప్రషియత్న సాధ్యమే కాని
కూర్చున్న చోటికి కూడి రాదెదియు,
కష్టే ఫలీ" యంచు గమోక్తి యొకటి
అపు డామె విసె నంతరంగమ్ము నుండి.

దినమెల్ల విరహవేదనగ్రాగి, క్రాగి,
వరవంత నెదురు తెన్నులు చూచి, చూచి.
పశ్చిమాశా రమ పడకటి ల్జెరె
తృటిలోన చేతికందిన భాను తోడ.

ప్రాణేశుగౌగిటి పారవశ్యమున
ఆమె చిమ్మిన శిరోజావళి వోలె
చీకటి వ్యాపించె లోకమ్ము మీద
చుక్కపూదండలు శోభించె మింట!

ఆశలు వీక్షించి, అశ్రువుల్ నించి
అంబపాదము లంటి, అటనుండి లేచి,
విరహిణీ జనరూక్ష వీక్షల గుసిగి
ఇరులలో రాలిన యిందు బింబమున;

ప్రాణేశు వెదకుచు పైనమై యామె
సాగిన దారేయి మూగదారులలో;
ఒత్తిగించిన తీగ లూకొట్టు చుండ
రమ్మని ప్రార్థించు రయమున నతని.

"అప్పగించిన నీవు అగుపించు ముందె
రాత్రికి నన్నీడి రవి వెళ్లిపోయె;
ఎవ్వరి ప్రియసఖు లెవ్వరి కౌదు,
రమ్యత శీకరమూర్తి! అరుదేరు మింక!

తేలికగా పూవె తెగిపోవుగాని
ఝంఝులకైనను జడియదు ప్రోడు,
ఏముల్లు చించిన, నేది వంచినను
అలు గుత్తునె-తత్సమాంతరంగమునె.

సందె కునుకు లోనె శారీకుమారి
కలవరించెను, నాదుచెలి తోచె నేమొ!
దూరాన-దిక్చక్రతీరాన నదిగొ
చుక్కరాలెను, మిత్రుజూచెనో యేమొ

నారాజు వచ్చెనో రేరాణి దారి,
తన పరీమళముతో ననుబిల్చు నామె!
చూచెద" ననుకొంచు సుందరి సాగి
వెదకిన దందందు విరితీవ పొదల.

"పూవులలో నొక్క పూవునై, నీకు
త్రోవ జూపింతునా తావులు పంపి?
చుక్కలలో నొక్క చుక్కనై నిన్ను
పిల్చుక వత్తునా ప్రియురాలి గదికి?

మిణుగురునై నేను మిత్రమార్గమున
వెలుగులు చూపగా వెడలంగ లేను;
కోకిలనై యొక్క కేకతో నేను
ప్రియునికి నాగుండె వినిపింపలేను.

ఏమాయెనో, మిత్రు డేదారి జనెనో,
చీకటిలో నెన్ని చిక్కులు పడునొ,
కుసుమమ్ము నెవ్వరో కోసిన దాన
తోచెను మొదటనే దుశ్శకునమ్ము"

ధగధగభాసిల్లు తారాప్రదీప్త
తరళాశ్రు కణములు ధరణికి రాల్చి,
రత్నగర్భకు జాతిరత్నమాలలను
కానుకలర్పించి, కరములు మోడ్చి:

మధువాని నిద్రించు మలయసమీర
సుఖతర స్వప్న భాసుర కంఠరవళి
కంఠమ్ము రవళించి గానించు పుష్ప
కంఠమ్ములో తాను కంఠమ్ము కలిపి!

ఈలపుర్వుల సంద డెల్లను నిలిపి
పొదరిండ్ల చెవు లగ్గి పూదోట వినగ,
సాదరమ్మున దన్ను సాకుచు నున్న
ప్రకృతికి సతి యిట్లు ప్రాధేయపడెను:

"ఏమమ్మ, నాతల్లి, ఏడి నా సఖుడు?
తల్లిదండ్రులు లేని పిల్లను నేను,
ఒడిజేర్చి కాపాడు చుంటి విన్నాళ్లు,
నీవ యుపేక్షింప నేనెట్లు మనుదు?

అప్రమత్తవు నీ వహర్నిశ లందు,
ఎవ్వరో పూలు త్రుంచిరి చూచినావె?
నీవ కోసితి వమ్మ? నీ ప్రాణ పతికి
నెత్తావి మాలలు గ్రుత్తువా యేమి?

బృందారకీ మందమంద ప్రచార
సుందరానందన నంద నారామ
వికచ మానా మ్లాన విలస త్ప్రసూన
మాలిక లుండ మాపూలు నీకేల?

నీ మధురసములు నేగ్రోలి, గ్రోలి,
నీ లతాంకము లందు నే నాడి, యాడి,
నీ నిసుంగుల నొక్క నిసుగునై నేను
పెరిగితి నిన్నాళ్లు, పెద్దనైనాను.

అమ్మవై నన్నెంచి, అక్కున బెంచి,
కంటికి రెప్పగా కాపాడి నావు
పెనవైచు కొన్న నా ప్రేమ వల్లికను
త్రుటి నొక్క ఝంఝతో త్రుంప జూచెదవా?

ఝంఝలు గురువనీజావళి గూల్చు
గాని నమ్రతృణమ్ము గదుపగా గలవె?
మొగ్గలు గిల్లి పార్వోతురు గాని
పల్లవించు గుణమ్ము బాపువారెవరు?

జలముల నారూపు తిలకించు కొనగ
రాతిని బడ ద్రోతువా తోయ మందు?
కాసార మొక్కింత కలగును గాక
ఏమౌను నారూప, మేమౌదు నేను?

నాప్రేమలోతుల, నారయ గోరి
దాచితివో యేమొ తల్లి! నా సఖుని?
రాత్రి గర్భమ్మున రవి దాగునట్లె
రవి గర్భ మందున రాత్రియు దాగు.

ఎంత కాలము దాతువే పూవు లోన
పిందెను? పిందెలో పృథు మాధురిమను?
విత్తనమ్మున రమ్య వృక్షమే యిమిడి
ధర నెంతకాలము దాగి యుండెదును?

కోపమా తల్లి! నీ కొమరు గొమ్మపయి?
నీ కొమ్మ, విరిగిన నీకుగాదేమి?
జగతిని సేవించ జాలిన మేటి
పూలెన్ని దానితో రాలిపోయెదునొ!

పర్వతశిఖరాన ప్రభవించు వాగు
వడి ధూకి ముందుకు పడి వచ్చు నట్లు
ఎందున్న గాని నా హృదయేశ్వరుండు
గడియలో నాచెంత కరుదేరు గాక.

అంధకార కులాయ మందున్న పక్షి
శుభ్రాంతరాళమ్ము జొచ్చి లక్ష్యముగ
కొసకొమ్మ ఫలమును గొనుమాడ్కి నేను
చిటికలో మిత్రుని జేరుదుగాక.

మార్గమ్ము జూపుము మాత! నా కిపుడు,
దివ్య దృష్టిని బ్రసాదింపు మొక్కింత;
చలనచిత్రము వోలె సర్వవిశ్వమ్ము
సుస్పష్టమై నాకు చూపట్టుగాక.

కాచగోళము రీతి కడు నిర్మలముగ
కనుపించు గాక లోకము లెల్ల నాకు;
సృష్ట్యంతరంగంపు సూక్ష్మ ధర్మములు
అపరోక్ష రీతి ప్రత్యక్షమౌ "గాక!"

వినుచు నిశ్శబ్దమ్ము, వెర్రిగా నేదో
కనరాని దానిని కనుగొంచు నామె
అలికిడి యేదైన నాతడే యనుచు
విభ్రాంతి నందుచు వెదకె నందందు!

ఎడబాటు చూపుననే చూపు నిల్పి,
ఎడబాటు పల్కుననే పల్కు గల్పి,
గురిసూచి విడిచిన కువలయాస్త్రమన
ముందుకు వడి సాగి పోయిన దామె.

నిశ్చలోపాసనాన్వితమైన ప్రేమ
లోగొన లేనిది లో కాన లేదు,
భావము గాఢమై వాస్తవ మౌను,
ఆధారమౌ దేనికైన తపస్సు.

మిత్రుని వెదకుచు మెల మెల్ల నామె
వచ్చిన దాప్రాంత పర్వత గుహకు,
కుసుమ గంధము బీల్చి గుబ్బిడుచున్న
కొండ దేవత ప్రక్క గూర్చున్న దలసి.

హృదయ మందున్న మిత్రుని బైటవెదకు
కామిని పదముల గాల్దివ్వె బట్టి
అందాక వచ్చిన దెందు బోయినదో
మించిపోయిన రీతి మిణుగురు బుర్వు!

ఆహవ భేరి గా నంతరంగమ్ము
ఉద్రిక్తమై పొంగి ఉబ్బాత లూగు;
ప్రాంత మందలి జలపాతమ్ము వహ్నొ
కాజ్య మందిచ్చుచు రాజ్యమ్ము సేయు.

* * *

## అపశ్రుతి

చీకటి కలవడ్డ చెలి కన్ను దోవలు
తనను రెండుగ జేసి ప్రణయమ్ము నెరప,
కాంచు వేడుక దూర్పు కనుమపై కెక్కి
బహుళాష్టమీందు బింబము తొంగి చూచె

పరనారి నారీతి పరికించు ప్రియుని
ధూర్త వర్తన రోసి, తొలగిరి దారి
తారాసతులు; దిగంతముల వ్యాపించె
నానోట నా నోట నాతని పరువు.

సుఖనిద్ర గొను ధరాసుందరి మేన
విషమ గ్రహోదుల పీడ లేకుండ
కరుణ జంద్రుడు దోమతెర గప్పె ననగ
ప్రవహించె వెన్నెల వనముల, నదుల.

ఆ ప్రవాహపు తరంగావళి వడికి
కొట్టుకు వచ్చెనో కువల యేశుడన,
డోలాయమానుడై బాల వయస్కు
డొక్కడు కనుపించె బ్రక్క బూబొదను.

చంద్రికా ముకురాన ఛాయగా దోచు
మధుమాస దాసుడా మాధవుడేమొ!
ప్రకృతిలో పరమేశు బ్రతిబింబమేమొ!
దూరాన కాతడు దుర్వగాహనము.

పండ్లున్న చెట్టును పసిగట్టు పక్షి,
పూవున్న తీగకె పోవును దేటి,
ప్రేమ కోసము పోవు ప్రేమ జీవులను
ప్రేమమే చేరు నన్వేషించు కొనుచు.

తన మనఃఫలక చిత్ర స్వరూపమ్ము
ద్రఢిమ నూహా వ్యవస్థను దాటి యట్లు
సహజ రూపము తోడ సాక్షాత్కరించె
కానిచో నామె యేగతి గాంచు నతని

కడు నల్లి బిల్లికగా నల్లుకొన్న
మల్లికా వల్లికా మంటపమ్ము పయి
నేటవాలుగ వాలి యేదొ చింతించు
సఖుని చేరువ కామె చల్లగా నడిచె.

అది శశ్యుపల విగ్రహమ్మోనో? కాదు,
అతడు సమాధిస్థుడౌ నొక్క యోగి!
వస్తు కాల జ్ఞాన నాస్తికు డతడు,
పరమార్థ నిర్మాణ పరుడైన శిల్పి!

ఆమెకే అనుమాన మైనది- తనదు
చెలియొ, తదాత్మయో చెంత నున్నదని!
ధైర్యమ్ము నూని యాతని జేరి నారి
వైచెను భుజముపై పాణిపల్లవము.

వైచినయంతనే- భావలతా ప
రంపరల్ తెగి అంతరాళ సౌధములు
పడిపోవ నాతడు పడిపోయె భువికి
చింతా మహోదగ్ర శిఖరాల నుండి.

పడి, తెల్విగొని, ఉల్కిపడి లేచి, యతడు
ఆవేగ మంతట నణగారి పోవ,
ఆమెకు గేలిచ్చి ఆసీన జేసె;
నిశ్శబ్దగతి నొక్క నిమిషమ్ము గడిచె.

సమశక్తి గల అయస్కాంత యుగ్మకము
వోలె, పరస్పరోద్వేల హృదబ్ధి
శీఘ్రువత్ప్రణయ వీచికలు పైకొనగ,
జరిగిరి వార లక్కరియొుడి కొకరు.

కౌముదీశుని పొందు కలువయు పోలె
హృదయాన శాంతియు, వదనాన గాంతి
వెలయ, నా చిన్నది చెలి మోము జూచి
కంటిలో కన్నీడి కడగి ప్రశ్నించె:

"ఎందేగినాడవో యిందాక, సఖుడ?
ఇందాగి యుండుట కేమి కారణమొ?
అబ్బ! ఈ రేయి నీ వగుపించ వంచు
వ్యర్థమ్ముగా నెంతొ వ్యధజెందినాను.

నిను బాసి యుండిన నిమిషాలు పేరు
టలలైన శోకమహార్ణవ మీది
నీ జాడ నావపై నీ సంగతి ప్ర
తీరమ్ము గొన్న యాత్రికురాల నేను.

కడ గానరాదొ, యేకాకిని నౌదు
నో, నౌక యే తుపానున భగ్నమౌనొ,
నీదర్శనమ్మింక గాదొ నా కనుచు,
ధైర్యమ్ము సడలి, యెంతయు గుంది, కుంది;

అడుగులు వేయించు నమృత శక్తియయి
భారమ్ములైచి, నీ పదములు గంటి;
ఎందేగినావు? నీ విందాక నేల
రాక నిల్చితి వింత రాతిరి దాక?

కష్టాలు పడితివో? కన్నీరు నింప
కారణ మేమౌనొ కరుణాంతరంగ?"
కనకాంగి చెలికాని కన్నీరు తుడిచి
ధైర్యమ్ము గొలుపగదగ నిట్టు లనియె:

"నీ కంట నీరు చిందిన, నాయెడంద
నెత్తురు చిందును నీపాదమాన;
నీ ప్రేమసఖిని నన్నీ క్షింపు మిదిగొ,
దుఃఖింప బోకుము, దుఃఖమౌ నాకు.

నీ ముఖమండలి నిబిడమ్మై యొసగు
చింతా తమో గాఢ జీమూత పటలి,
నా మనోహంసికానంద మాధురుల
విధ్వంస మొనరించు విధమును గనవొ?

తూరుపు కొండపై తోయద మాలి
కాంతఃపురమ్ముల యవనిక లందు
శర్వరీ కాంతతో సరసమ్ము లాడు
వృద్ధ రాజమ్మున్యు వీక్షింపు మదిగొ!

ఈ లోల వెన్నెల పాలసంద్రంపు
టడుగున, తేజోమయమ్ములై మించు
సుమరత్నములు దాల్చి, సుఖముగా మనము
ఆడుకొంద మిక మత్స్య మ్ముల రీతి.

మంజుల మణిశయ్య మనమాడుచుండి
బడబాగ్ని కీలకు భయపడ నేల?
చంద్రమానుని తోడ సఖ్యమ్ము నెరపి
ఆరాటపడ నేల నమవస రాగ?

మనసిచ్చి నాతోడ ననదోట లెల్ల
దిరుగాడు వాడ వీ దీనత్వ మేమి?
లెమ్ము, చింతను విదలింపుము, రమ్ము,
బాష్పమ్ము లాపుము, భరియింపలేను,

కోపమా నామీద? కోమలహృదయ!
నిర్దయ నీవెందు నేరిచినావు?
పూదేనె దెత్తునా? పూలు కోసెదన?
ఫలములు వలయునా? పాట పాడుదున?

లె''మ్మని లేపిన కొమ్మను, లే గు
లాబి వల్లికబట్టు లాగున బట్టి
పుష్పమునుం బోలు మోము ముద్దాడి,
వైరాగ్యబుద్ధి మై బల్కె నిట్లతడు.

''ఇందూదయముగాని యిప్పటి దాక
కటికి చీకటి లోన గడిపితి వీవు,
వెన్నెలలో పొంగి మిన్నంట నేల?
నెలగూకి పోవదా? నిత్యమా వెలుగు?

జన్మించి సంతన జననిని విడిచి
పెరిగిన యా లేడి పిల్లను గనుము!
తల్లినే యెరుగ దీ మల్లికావల్లి,
పర గృహమ్మున బెంపబడిన దా పికము.

చెట్టు చెట్టుకు నేమి చుట్టరికమ్ము?
తెలియని యే గాలి దెబ్బలో తగిలి
మోహ లతా పాశములు తెగు నేని
ఎవ్వరి కెవ్వరే పువ్వుల బోణి?

ఆది నుండియు దన కాశ్రయమ్మైన
గున్న మామిడి నేల కొరగిన దనుము,
దానితో నేశకుంతమ్మైన జనునె?
కట్టదా గూడు వృక్షాంతర మందు?

ఒక కొమ్మ విరిగిన నుర్వీజ మెల్ల
దోతోన విరుగునా? దుఃఖ మజ్ఞాన
జనాతాంధకారము, జ్ఞానసూర్యోద
యము గొమ్ము, వికసింపు మబ్జాకరముగ."

ప్రణయ లతాలవిత్రము నాగ జెల్లు
సఖు భాషణము విని, సారసనేత్ర,
నిశ్చేష్టురాలయి, నిట్టూర్పు విడిచి,
అతని హస్తము తన హస్తమందు గొని;

"తీయని పండ్లను గాయు లే మావి
ముషిణి కాయలు కాచి మోసగించెడునె?
కమ్మ తావులు జల్లు కమలాకరమ్ము
వెగటు వాసనలతో విషమూదగలదె?

ఏమిది నెచ్చెలీ? ఎన్నడు లేని
కఠినోక్తి వింటి నీ కమ్ర కంఠమున!
వెన్నెల గురియు జాబిల్లి యేనాడు
తలపోయ లేదు నిప్పులు గాయు నంచు.

అనురాగ రంజిత హాస మాధురులు
జీవితోషశ్శుభ శ్రీలు వెలార్ప,
సమ్మద ప్రేమ వాక్చయ విలాసముల
కోకిలపై నాకు గూర్తు విన్నాళ్లు.

అర్థమ్ము కాని యీ వ్యర్థ వైరాగ్య
భాషల నీనాడు బాధింపనేల?
పూవులు రాలని, తీవలు తెగని
ఉద్యాన వన మట్టు లుందము మనము."

నుడువుచు, ప్రియుని కన్నుల గన్ను వెట్టి,
గారాము గురియుచ్చు, కాంత సాగించె,
"ఏమైన, నీ మార్పు హేతు వేదైన,
కరుణ రసమ్ము నింకగనీకు మెపుడు

నీ మాటలందు ధ్వనించును ఘోర
తర వియోగమ్ము, దుర్భర మది నాకు;
ఎడ బాయలేను నిన్నింకొక్క సారి,
ఎడబాతు నేని నన్నెడబాయు దనువు.

రాలెడి పువ్వుల రాలి పోనిమ్ము,
విరిగెడి కొమ్మల విరిగి పోనిమ్ము;
మొగ్గ గిల్లగ నేల? మోజుగా నెదుగు
కొమ్మను నరికెడి కోర్కె నీకేల?

రమ్మి మనోహరారామ సీమముల
చంద్రికతో కేళి సల్పుద మింక,
వట్టి మాటలతోడ వగపుల తోడ
వెలలేని కాలము వృథ జేయ నేల?''

అని తన ప్రియతము ననునయ ఫణితి
బ్రతిమాలుకొన్న దా బాలేందుహాస;
ప్రేమించువారలు ప్రేమించరేని
హృదయ మొందెడు బాధ కెక్కడి దవధి?

ఝంఝావి భగ్నమై జలరాశి నడుమ
తల్లినౌక మునింగి తల్లడమందు
సుకుమారి కొక్క యానిక చేతి కంది
నురుగుగా నదియును కరగి పోవు నటె?

సృష్టినెవ్విధినైన జీవనమ్మునకు
ఆధారమును బట్టి యాకారముడరు,
ఏరీతిగా నిరాధార జీవనము
నే నని యంతరాళాన నిల్చెడును?

తారాసమేతుడై తరలు జాబిల్లి
కన్నె కలువ పిల్పు మన్నింప గలడె?
ప్రణయమోహన లతాబద్ధ యౌ కలువ
హృదయేశు బిలువక యెట్లుండ గలదు?

లంకలలో, శీతల ప్రభాతముల,
చేలగట్లను కాపు బాలుడు త్రిప్పు
ఒరిసెల రాలన గురియాయె నతని
యొదార్పు లా బాల హృచ్చుకమ్మునకు,

ఆకటి కంటితో నవకాశవీధు
లెల్లను గాలించి, యెట్టకేలకు న
యనపర్వముగ నొక్క ప్రణుత కేదార
మును గాంచి విశ్రమించిన బాలశుకిని,

క్షేత్రపాలకు డొరిసెల గొని పైచి
హృదయమ్ము జించిన నెవ్వరు దిక్కు?
ఒరిసెల పని యేమి టుండు గాకున్న?
విచ్చలవిడిగాగ విడుచునా పొలము?

ఆకలి పుట్టించి, అన్నమ్ము జూపి,
ఒరిసెల గట్టించి యుంచె నాదరిసె!
ఎవ్వడో యీ సృష్టినెల్లను జేయు
వాడర్భకుడొ, పిచ్చివాడొ, రక్కసుడొ!

నిశ్చలమూర్తియై నిల్చిన సఖుని
చెక్కిలి మీటించి, చెంగల్వ కొలను
రూపించి, వాంఛాధిరూఢయై యామె
వాంఛావరూఢుగా బ్రార్థించె నతని.

"కాంచుమా రమణీయ కల్హార వనము!
తిలకింపుమా పైని జలపాత మొండు!
ఆపైని నీహారహార భూషితను,
జ్యోత్స్నాకుమారిని జూడు మో దేవ!

ఆ యేరు, నీ యేరు నారెంటి నడుమ
గల సీమ మెల్లను గడిచి, తద్యుగళ
సంగమ పావన స్థలమును జేరు
కొందము, కథ జెప్పుకొంద మీరేయి.

లేలెమ్ము, పోదమా బాలమామిడుల
వెన్నెల నీడలు వేదనల్ బాపు;
పండు టాకులు రాలి పడు సవ్వడులల
ఉపశాంతి పొందెడు నుల్ల మెందులకొ!"

దీనయై పల్కు నా మానినీమణిని
జాలిగా జూచి యా బాలవేదాంతి,
భూమిని జూపి, నభోవీధి జూపి,
నన నొండు త్రెంచి, మెల్లన జించివైచి;

"ఈ మొగ్గ గిల్లుట కేడ్చు నీ రెమ్మ,
ఆ రెమ్మ కుసుమ మాహ్వానించు దేటి!
రెమ్మలు రెండొక్క కొమ్మవే కావె?
రోదించు నొకటి, వినోదించు నొకటి!

ఆకాశమును జూడు. మలివేణి! స్వప్ర
కాశ రమ్యములు నక్షత్ర సంతతులు,
దేని ప్రకాశమ్ము దానిదే కాదె?
దేని గతి స్థితి దానిదే కాదె?

ఒకదాని కాంతి మరొకదాని కాంతి
హీనమ్ము చేయును కాని పెంచెడునె?
ఎవరికి వారైన యీలోక మందు
ఒకరి కొక్కరు చింత నొందగ నేల?

పూయుమా యన్నచో బూయునా తీవ?
రాల వద్దన్న చో రాలదా పూవు?
ఎవ్వ రెరుంగుదు, రెవరు శాసింతు,
రాద్యంత రాహితి కధినాథు డెవరు?

తునిగెనన్కొమ్ము నీతోట మొగ్గొకటి,
మధుమాసమున వచ్చి, మధుగీతు లాల
పించి, నీ పికము పోయిన దనుకొమ్ము,
పోయెద నే, నుండిపొమ్ము నీ విందు.

బాలిక యింట దీపము వెలిగించి,
ఆర్పివేయును పనియైనంత దానె;
అవనిలో నెల్లకార్యము లిట్లె సాగు,
ఉష్ణశీతము లేలనో బాష్పములకు?"

వెలిగించుకొన్న దివ్వెను పెనుగాలి
ఆర్పివైచిన రీతి, నామె కర్తవ్య
తా విమూఢత నంధ తమసున ద్రెల్లి,
దిక్కు గానని పేద తెర్వరి వోలె;

నింగి, నేలయు నొక్క నిమిషాన గలిసి
కాలమే శూన్యమై కడతేరె నట్లు,
అవ్యవస్థను మున్గి, అంతలో దెలిసి,
సఖుని గడ్డము బట్టి సఖి యిట్లు పల్కె.

"నీ విందు వచ్చిన నిమిషమ్ము నుండి
రమ్య కురంగీ కురంగాల, భృంగ
భృంగీ కులమ్ముల, పిక పికీ నికర
ముల పవిత్ర స్నేహమును బాసి నాను.

నా తల్లి పోయిన నాటి నుండియును
నన్నొక్క శార్దూలి కన్నబిడ్డవలె
సాకిన దీ విందు చనుదెంచు దాక,
నాతోడ నాడుకొన్నది దాని బిడ్డ.

సెలయేట నీదాడి, చిగురు జంపంపు
టింటికి చేరగనే లతామాత
తలిరాకు గేల నాతడి యొల్ల నొత్తి
తినిపించు చుండెను తీయని పండ్లు.

వనరాజ్ఞియౌ నొక్క వానరి కేను
కడు గూర్చుబిడ్డనై కడకొమ్మ లెక్కి,
కొండలపై బ్రాకి, కోనేట దూకి,
ఆడుకొంటిని బెంగయన్నది లేక.

నగ్నప్రకృతి నిజ నందన నన్ను
వర్షాతపమ్ములు బాధించ లేదు.
శీతోష్ణములు నన్ను చేరదీసికొని
తమ గర్భగృహమున దాపోసంగినవి.

నాడు నే నేకాకి నైనను, ప్రకృతి
పుత్రికలం దొక్క పుత్రిక నగుట
నేకాకి నను భావమే లేకపోయె;
నేడు నే నేకాకి నీవుండ వేని.

ప్రకృతి సన్నిహితంపు పరిచయు మెల్ల
విస్మరించితి నీదు ప్రేమమ్ము లోన,
ప్రకృతి రంగము నుండి స్వాంతమ్ము మరలి
రక్తయై నీ యంతరంగము సొచ్చె.

హిమబిందువును జేరి ద్యుమణి బింబమ్ము
దానిని దీప్తిమంతము జేయు నట్లు,
ప్రేమతో దరిజేర్చి, ప్రేమించి, దేవ!
నను ధన్యురాలి నొనర్చితి వీవు,

కిరణాలు తను మనోహరు బ్రీతి దివ్య
పథములకెత్తి, యుపాసించు కొనును;
ప్రేమ మాధురు లెల్ల హృదయేశు నిన్ను
పురుష రూపమ్మున పుడమికి దెచ్చె!

ప్రేమమే యేలను? కృపచాలు నాకు;
చాలును నాకు నీ సన్నిధానమ్ము;
పరిచర్య చేయుచు పడియుండ నిమ్ము
సదయమ్ములైన నీ పదముల మ్రోల.

ఎడబాటు మాటనే యెత్తకు మింక,
గుండె బ్రద్దలు చేయకుము, పుణ్య మౌను;
నవ్వుమా ఒకసారి నావంక జూచి,
నెలవంక కేను వంకలు దిద్దు దాన."

ప్రణయిని తానట్లు ప్రాథేయ పడిన,
అవశమ్ము కాసాగె నాతని యెడద;
కర్తవ్యమేదో భీకరమూర్తి దాల్చి
వెన్ను దట్టిన దంత, బెదరె నాతండు.

కర్తవ్యమున లేదు కరుణకు దావు,
స్వార్థమ్మునకు ప్రేమ శత్రువే యౌను;
విజ్ఞానపరుడైన వేదాంత విదుని
హృదయమ్ము కర్కశ మేల గావలెను!

★ ★ ★

## సంశోధన

"మాయెరుంగవు నీవు, మానవ స్నేహ
వాసన నిను మార్చి వేసె నో చెలువ?
బంగారమౌ నీస్వభావమ్ము నేను
పాదరసమ్మునై పాడొనర్చితినె?

భువనమోహన గీతముల నాలపించు
పక్షి రాజమునకు పరభాష నేర్పి,
ఊదివైచితి నుపజ్ఞా దీపకళిక!
పారవంచితినుష్ఃప్రజ్ఞా మధూళి!

నిను నేను ప్రకృతిజనని యొడి నుండి
వేరు చేసితినేని సైరింపు మింత,
అనుకొన్న దొక్కటి, ఐన దింకొకటి,
దైవిక మ్మెరుగని దౌర్భాగ్యు డితడు.

కాంత! నిన్ దొలిసారి కనుగొన్న యపుడు
దేవకన్యకవని భావించినాను;
రవి నేడిపింప మానవరూప మొంది
అవతరించిన యుషస్సువో యనుకొంటి.

నీవు కోసెడి పూలుగా విరబూయ
నెందరు తప మాచరించిరో మున్ను!
నీ పాదములు మోసి నీ పూజ సేయ
భూదేవి యెట్టి నోములు నోచుకొనెనో.

అనుకొంచు, చాలగ గనిపెట్టి నిన్ను
తల్లిదండ్రులు లేని తాపసాంగనగ
గుర్తించినాను; శకుంతల గాథ
జ్ఞప్తికి వచ్చి నన్ బాధించె నంత.

దివ్య సౌందర్యమ్ము దిక్కుమాలినది
గా గహనమ్ముల గడతేరి పోవు
నో యని చింతించి, యోగ్యమౌ రీతి
లోకమ్మునకు నిన్ను జేకూర్ప దలచి;

అవసర ధర్మ విద్యా విశేషముల
నిధినిగా జేసితి నిను, కురంగాక్షి!
అనుకొన్న దొక్కటి, ఐన దింకొకటి,
కాలగర్భపు లోతు కనుగొను టెట్లు?

వెర్రిగా నన్నేల ప్రేమింతు, వకట?
నీ లేడికన్న నే నెందులో మిన్న?
ఏరీతి బ్రేమింతు వీవు నీ లతను,
ప్రేమింపు మెపుడు నారీతినే నన్ను.

ఎలమితో, చెలిమితో నిన్నాళ్ళు నిన్ను
సంతోషపెట్టిన శారీకుమారి
తనువు నేవిధమున త్యజియించి పోయె
ఆ విధమ్మున నన్ను బోవగ నిమ్ము.

నీవు ప్రేమించెడి పూవుల లోన
ఒక్కటి రాలెనం చూహించు కొమ్ము;
పగలెల్ల నీ తోటపట్టున నుంటి,
రాలిపోవుదు నింక, రాత్రి కావచ్చె.

వర వసంతము వచ్చు వచ్చు నంచెంతొ
వేచి యుండియు, వచ్చి వెడలి పోకుండ
దాచుకోలేని వ్యర్థ ప్రపంచ మిది;
ఆపగల్గునె శిశిరాగమునమ్ము?

కల్గు సంయోగము, కల్గు వియోగ,
మవిలంఘ్య మీ జీవయాత్ర, లతాంగి!
కల్గు సౌఖ్యమ్ములు, కల్గు కష్టములు;
కాలచక్రము నడ్డగల్గు వారెవరు?

అని యాతడాడి లేచినయంత, నామె
ఆందోళి తాత్మకయై పల్కెనిట్లు;
అశుభమ్ము లాడకుమా, హృదయేశ!
ననవోలె నీవేల తునిగి పోవలయు?

విధివిలాసమ్మున ప్రియతమ! మనము
ఒక గుత్తి పూలమై వికసించి, నేడు
విడివిడిగా రాలిపడు కర్మ మేమి;
రాలిన – జంటగా రాలి పోవుదము,

రాలు కాలము వచ్చి రాల్చు నందాక
భువన మాధురు లెల్ల పొంది, యానంద
మొందగా వలయును; ఊరకే మధ్య
ధరణికి రాలిపో దలపోయ నేల?

సుఖపడగా లేక శోకించు చేవో
వట్టి బాధలు తెచ్చి పెట్టుకో నేల?
దేవతలకు బోలె జీవిత ప్రసవ
మధువులు గ్రోలగా మన కడ్డమెవరు?

మధుమాసమే వచ్చి మన చేత నుండ
గ్రోలింప వేరొక్క రేల కావలయు?
లోకమ్మునకు వేరె చే కూర్పనేల?
లోలాత్మ! నీవపో లోకము నాకు.

నీవంటి వారును, నావంటి వారు
వేనవేలుగ గల్గు వింతలోకమున
అంద మేముండు, నానంద మే ముండు?
సంఘ జీవిత మేమి శాంతి ప్రదమ్మో!

ఈ మహితోద్యాన సీమ నిర్భరము
విహరించు నట్టిదే విమల జీవితము;
ఏకాంతమే లేని దెంతటి దైన
పారము ముట్టగా నేరదు ప్రేమ.

చాల యసహ్యము సంఘజీవితము,
తాపత్రయమ్మేల దానికై యింత?
ఇష్టమ్ము కాదొ నీ కీ వనసీమ?
చక్రవర్తిత్వము సల్పు మీ విందు"

ఆలోచనా మగ్నుడై యాతడొక్క
పరి తన చుట్టును బరికించి చూచి,
సఖిమోము గాంచి, బొప్పు మొమ్మెండు రాల్చి,
క్రొన్ననతో నామె కన్నీరు దుడిచి:

"నిన్ను నే నెరుగుదు గొన్నాళ్ళనుండి,
నీ యంతరంగము నే నెరుంగుదును;
నా కన్న లోకము నీ కెట్లు లేదొ,
నీకన్న లోకము నా కట్లు లేదు.

లోక మెరుంగని లోలాత్మ వీవు,
లోక మెరింగిన లోభిని నేను;
ఆదర్శమునకును అనుభవమ్మునకు
మధ్య భేదమె మన మధ్యను గలదు.

పరమాత్మ తా నెంత పావన మగునొ,
అంతె పావనమగు నందు ప్రత్యణువు;
ప్రేమింతు నేను ప్రకృతిని గాఢముగ,
అందొక్క లలిత లతాంతమ వీవు.

కఠినాత్ముడను గాను, కాల చక్రమున
నలిగి పోవున వెల్ల ననలే, లతాంగి!
దైవమే విధిలేక, దయ లేక మనకు
ఎడబాటు గూర్చిన నేమి చేయుదుము?

బాల చంద్రికయైన బాధించునట్టి
కమనీయ లావణ్య సుమ బాల వీవు;
నిశిత కంటకము వంటిది సుమ్ము జగము,
మృదు పాదమున ముల్లు మిక్కిలి నాటు.

మరచి పొమ్మిక నన్ను మారాకుబోణి?
స్మరణమ్ము బెంగ కాశ్రయ మిచ్చు నెపుడు;
విరుగుడు లేనట్టి విషము సూ బెంగ!
తినివేయు సౌఖ్యమ్ము, తినివేయు బ్రతుకు.

ఒక పూవు ముకుళించె నొక తార రాలె
ననుకొని, నీ శకుంతాది మిత్రముల
గలిసి, పూర్వపు రీతి గడుపుము దేవి!
సహజమౌ నీదు స్వేచ్ఛా జీవితమ్ము."

అనుచు నతండు లేచిన తోన, నామె
కాలికి గుది పైచు కలువ కాడ వలె
నాతని కడ్డమై, ఆశ్రయ మంత
వీడిన తీవగా విరుచుక పడియె.

ద్రవియించుచున్న చాంద్ర శిలాప్రతిమయొ
నా నొప్పు నా కరుణామూర్తి బట్టి,
ఒడిజేర్చి యాతడు నుప్పొంగి వచ్చు
తన దుఃఖమున బాపెదన్వి దుఃఖమ్ము!

ఉదయాద్రి చెమ్మపై నుత్సవకేళి
చంద్రికాదీపమ్ము జక్కటి నిల్పి,
శయ్యా గృహమ్మున శర్వరీకాంత
నగ్నముగా నంత నర్తింపజచ్చె!

"కర్తవ్యమును మించి కరుణ గొప్పదిర!
కరుణకు మించి లోకము లేదు గదర?"
అని ప్రాంత వేణు వనాంతరమందు
పవమానుడప్పుడు పాడ దొడంగె.

ఏమిటాదర్శ మీ సృష్టికి? ఎందు
కిన్ని బెంగలు, బాధ, లిన్ని ఘర్షణలు?
బ్రతుకుటే ప్రాణి తాపత్రయ మైన
ఒకరి కొక్కరు కాని దొక బ్రతు కౌనె?

హృదయ మందు తుపాను రేగి, ఘోరముగ
ఫెళఫెళమని యెడాపెడ గొట్టి విడువ,
మరి యొక్కసారి యా మగువ నోదార్ప
కరుణ కాతండు లంగరు వేసి, పలికె

"నిను ముద్దరాలిని నిర్దయ నొకతె
విడనాడి పోవ నా యడుగెట్లు పడును?
హేతు వొక్కటి కాలుసేతులు గట్టి
ననుబట్టి వడి లాగి కొని పోవుచుండె!

జీవితవాహిని జీవనాధిపుని
సంగమింపగ బోవు జటిల మార్గమున
పొందు నవస్థల యందు నీ చెలిమి
తుది మలుపైనది, తొయ్యలీ, నాకు.

కల్లోలములు కల్గె, కాలమేఘములు
వర్షించి విలయముల్ వచ్చె, నెన్నెన్నొ
సుడిగుండములు లేచి క్షోభింపజేసె,
కొండ లడ్డము నిల్చె, కోనేళ్ళు పొల్చె;

నా తలపై నవ్య నానాశకుంత
సంతాన గీతికా సంగీత మొప్పు,
నా గుండె లోతులలో గభీరంపు
మీనభావమ్ములు మిలమిల లాడె.

ఒకపరి పొంగి మిన్నొరయుచు, నొక్క
పరి క్రుంగి పాతాళపథముల బడుచు,
కదలెడు నా జీవనది కీవు దొరికి
పూవులు పూయించినావు నా నిండ!

అవధి జేరిన ప్రవాహము గాన నేను,
పూవి నీ యెదలోన పొందితి విరతి;
ప్రణయ ప్రశాంత విశ్రాంతి గృహమ్మి
నీ యెద, ఆనంద నీరజాకరము.

సెలవిమ్ము, నే నింక జలరాశి బంది,
జీవితమోక్షమ్ము జెందుదు, కొమ్మ!
మనుజులు కారు కావున వనప్రియ స
ఖాళి నిన్ బమ్మన కాదరించెదరు.

ఈర్ష్యాది భావములెల్ల మానవుల
గుండెలనే పట్టి గుంజును గాని,
ప్రణయరూపిణి యైన ప్రకృతి దేవతకు
స్వ పర భేదము లేదు స్వప్నమందేని.

ఓ వనలక్ష్మి! నీ యొడి నుంతు సఖిని,
కడుపులో బెట్టుక కాపాడు మమ్మ!"
అనుచు నాతడు మోడ్చి హస్తముల్ వేగ
వికలాంతరంగుడై విజ్ఞప్తిజేసె.

ఆతని కై మోడ్పు నట్టులే పట్టి
గుండియపై జేర్చుకొన్నది బాల,
ప్రాణ మంతయు గంటిపాపలో నిల్పి
తగ్గక ధర్మవాదన జేయ గడగె;

"నీ పూన్కి నేర్పడ్డ నీర జాకరము
నీవు పోయిన వెన్క నిల్చునా పూని?
ఓ నదీ! నీ కృపాహృదయమ్ము నందు
పొంద నిమ్మాశ్రయమ్మును నన్ను గూడ.

జలరాశిని వరించి జలజాక్షు నట్లు
నీవుండ, లక్ష్మినై నిన్ను వరించి
నే నుందు; కల్పాంతమైనను మనకు
ఎడబాటు కల్గుటకే వీలు లేదు.

మాటకు మాటగా మారాడు చుంటి,
కోపింప బోకుము కోమల హృదయ!
ఉండి పొమ్మిందు, లేకున్న నన్ను గొని
పొమ్ము నీతో, వద్దు మూడవ మాట."

★ ★ ★

## సమరకేళి

దిక్కులు పరికించి దీనత నెరిగి,
చెంపలు సవరించి, చెక్కిలి మీటి,
ఆసీనుడై, యామె నాసీన జేసి
కాంత కాతడు తన కథ చెప్పదొడగె!

"నేనాగి పోవగ, నిను గొని పోవ
సాధ్యమ్ముగాని క్లిష్టసమస్య వచ్చె;
నా సఖీ! తప్పదు నాక పాయమ్ము,
నీ కపాయమ్మేలనే గూర్చ వలయు?

కొమ్మ కూలిన, దాని కోటరమందు
సుఖముగా నిద్రించు శుకమును గూలు,
అట్టిదయౌ నాశ్రయ స్వభావమ్ము,
పైన మెవ్వరు గారు భగ్న నౌకపయి.

నన్ను క్షమింపుము, నాకథ వినుము,
తర్కించుకొనుము, కర్తవ్య మూహింపు;
మనురాగమును, ప్రణయము నెందు బోవు?
బ్రతుకు తెర్వున కవి బాధ కారాదు.

ప్రతి లేని వీరుల బ్రభవించు పచ్చి
బాలెంత గద మన భారతమాత?
తన సేవ లోన నా తల్లిదండ్రులను
శిక్షితులను జేసి చెల్వందె నామె!

దేశభక్తుల గను దివ్యక్షణమ్ము
సాటి లేనిది గదా స్వర్గమం దైన!
ఐన, వారికి, తత్సుఖావశత్వమున
స్వస్తివాక్యము పల్క జనయిత్రిమరచు.

గర్భాలయము నంద గరచె నాతండ్రి
అతిలోక వీర్యమౌ అభిమన్యు చరిత,
బాల్యమందునె యుగ్గుబాల నా తండ్రి
జీర్ణించుకొనె శివాజీ వీరగాథ.

నూనూగు మీసాల నూత్న యౌవనము
బాలచంద్రుని తీవ్రబల దీప్తులసగె,
ఝాంసీ సతీ వీర ఝంకార మందు
పదునెక్కె నాతని పౌరుష లక్ష్మి!

సామ్రాజ్యవాదపు జరణ దేశమున
పరతంత్రయై యున్న భారతమాత
అగ్నిరగిల్చిన దాతని యెడద.
స్వేచ్ఛాధ్వగాముని జేసిన దతని.

అతడు విజృంభించి, ఆత్మదేశమును
దాస్యపంకము నుండి దరికెత్తబూని
కూలిపోయెను నిరంకుశ పరిపాల
నా దురితాగ్నుల నాలుక లందు.

కన్నీట గంఠము గాద్గదికమ్ము
నొందగ, ప్రియసఖి సందిట వాలి:
"రాలిపో నున్న తారక నిల్పుటెట్లు?
విధమెట్లు రానున్న విలయమ్ము నాగ?

నా జనకుని వార్త నాతల్లి జేరి
దూతికయై యామెదోడ్కొని పోయె!
చంటిబిడ్డడు పోయె జననిపై బెంగ,
చెల్లె లొక్కతియును క్షీణించి పోయె.

పూడి పోయినది మా పూర్ణ కుటుంబ
కాసార, మంత నొక్కడ నేన మిగిలి,
చదువున కొక నమస్కారమ్ముచేసి,
ఏకాకిగా నంత లోకాన బడితి.

నిర్భర దుఃఖవార్నిధి మున్గినేను
మరణించు నట్లుండ, దరిజేర్తు మంచు
బుధులొక్కరొక్కరు బోధించినారు
నాకు మిథ్యాప్రపంచపు రహస్యములు.

మొగ్గజూచుక మోద మొందరా దనిరి,
మొగ్గ పూవై రాలిపోయెడు ననిరి,
ఉర్విపై వ్యామోహ ముంచరా దనిరి
ప్రారబ్ధ మెవ్వరు బాపలే రనిరి.

ఆగమమ్ములు మొద లన్ని గ్రంథములు,
మునులెల్ల బుద్ధదేవుని దాక "గజము
మిథ్య, పలాయనం మిథ్య" యటంచు
మన్యముల్ వట్టెను శూన్యవాదములు.

పండుటాకులు రాలి పడిపోవు వేళ,
ఎండుకట్టెలు చితి మండెడు వేళ,
పుట్టెడు భావముల్ పూదోటకెల్ల
సిద్ధాంతముగ జేసి చెప్పుట తగవె?

ఆలయమ్ముల విగ్రహమ్ముల మాడ్కి
ఫలశూన్యమైన యా వాదముల్ వాఙ్మ
యము కలంకారము లగునేమొ కాని,
చవి లేని గతి రుచించగ లేదు నాకు.

వ్యర్థ వై రాగ్య మిథ్యా ధర్మసేవ
చాలించి, నేనంత గ్రోల నేగితిని
మాతృ భారతదేశ మహిత పాదార
విందసేవా సుధానంద మాధురులు.

అచట సేవాగ్రామ మందు మహాత్ము
నాదర ణాభిమానమ్ములు పొంది
సత్యాగ్రహోద్యమ సంగ్రామ సీమ
పగరకు వెన్ను జూపక పోరినాను.

చీరాల, బార్డోలి, చెన్న పట్టణము,
దండి మున్నగు మహోద్యమముల లోన
లాటీకి శిరమును, తూటాకు రొమ్ము,
బ్రతుకెల్ల జైలు కంకిత మయ్యె నాకు.

నాయకులందరు నవ్యభారతపు
జనకునితోబాటు జైలున బడగ,
సత్యాగ్రహా మ్మపజయ మొందె నంచు
ప్రజలు నిరాశలో బడినారు తిరిగి.

హస్తముల్ మోడ్చి జోహారొనరింప
త్రాచుబామెపుడును దయజూప దనుచు,
వజ్రమ్ముచేతనె వజ్రమ్ము తెగును,
హింసచేతనె హింస నెదిరింతు ననుచు.

ముండ్ల డొంకల నెల్ల మొదలంట నరికి
తోటను బెంచెడి తోటమాలి వలె,
కలు పేరి పైరు మొక్కల బెంచు రైతు
గా నేను పనిజేయగ బూనినాను.

ముల్లు దీయగవలె ముల్లుతో ననెడు
సిద్ధాంతమును నమ్మి సిద్ధిలగూడి,
విప్లవమ్మనకు నుపప్లావ్య మనగ
రహిమించు నొక్క పర్వతగుహజేరి.

మంత్ర తంత్రక్రియా మార్గమ్ము లరసి,
వివిధాయుధ క్రమ విద్యలు గరచి,
వ్యూహ నిర్మాణ ప్రయోగముల్ నేర్చి,
స్వాతంత్ర్య సైన్యమ్ము సమకూర్చి నాను.

ప్రజలు గొఱ్ఱెల వంటివారు, తమంత
మిత్ర శత్రు విభేద మెంచుకో లేరు,
స్వార్థపరాయణ స్వాముల నమ్మి
తమ సంకెలలు తామె తగిలించు కొంద్రు.

విప్లవ సైన్యమ్ము విడివడి, దేశ
పారతంత్ర్యము బాప బోరాడుచుండ
పశ్చిమ భానుడు పడిపోయె గడలి
శ్వేత భల్లూకముల్ చెదరి పోయినవి.

కస్తూరి మాతను, గాంధీ మహాత్ము
కారావిముక్తుల గావింప బోవ
ద్రోహులు కొందరు త్రోసిరి మమ్ము
స్వార్థమ్ము కోసము శత్రువాగురల.

ఆ ఘోరశర్వరి, నా రణ మందు,
భక్త భారత బాల రక్తప్రవాహ
సందోహ మిల నెంత చిందెనో, తెలియ
దెంత దుఃఖించెనో యేమొ నాతల్లి!

కలగి, యాగతి, నరాతుల చేతజిక్కి,
బందిఖానాలోన బంధించబడిన
వారిలో నేనొక వ్యక్తిని; నాటి
రాత్రియే జైలుద్వారమును భేదించి;

కావలా భటులను గమ్మత్తు చేసి,
మారువేషము దాల్చి పారివచ్చితిని,
అందందు దాగుచు నిందేగుదెంచి,
కాంచినాడను వనకన్యను నిన్ను,

పూని రక్షక భటు లానాటి నుండి
వెదకు చుండిరి నన్ను వివిధముఖాల;
అందుగొందరు మన ప్రాంత కాంతార
ముల వచ్చుచుండిన యలికిడి తోచె.

భటులకు నే బట్టువడుదునో యేమొ
అనుమానమ్మై, నీకు గనిపించ కుండ,
గుత్తిలో పువ్వొండుకోసి, భారతిని
పూజించి నే పారిపోవ వచ్చితిని.

తడవు సేయగరాదు, తడసెద నేని
నిను గూడ నప్పగించిన వాడ నగుదు
క్రూర హస్తములకు, ఘోరమాతలవు,
పులుల కందిత్తునే ముగ్ధ కురంగి?

బెంగగా నున్నది వెలది! నిన్‌గూర్చి,
దైవ మున్నది లెమ్ము దయజూచు నిన్ను;
కాల మొకే రీతిగా నుండబోదు,
భావియెంతయు నీకు భద్రమౌగాక.

స్వప్న ప్రపంచ ప్రచారమ్ము సల్పి
అలసి గట్టెక్కిన యాత్మకుబోలె,
తెలి వొంది, పెదవిపై తృప్తిగస్పురచి,
నిట్టూర్పువిడిచి యా నెలత యిట్లనియె.

"పగలు సూర్యునిబోలె భాసిల్ల గలిగి
రాత్రి చంద్రునిబోలె రంజించగలిగి,
పౌరుషవంతుడు ప్రణయవంతుడును
నై వెలుగొందెడు నరుడు నూ నరుడు!

ఇన్నాళ్లు చంద్రుగా నెరిగితి నిన్ను
సూర్యునిగా నేడు చూడగల్గితిని,
సూర్య చంద్ర ప్రభాశోభితుడైన
సఖునికి సఖియౌట చాలదా జన్మ?

ఎవ్వరో త్రుంచినా రీ పువ్వు నంచు
కఠినోక్తు లాడితి గావుము తప్పు,
ప్రేమపూజకు సమర్పితమయి, అమల,
మమ్లాన, మమృతము నయ్యె నాపూవు,

నన్నొక్క పూవుగా నెన్నుము, దేవ!
త్రెంచుక పొమ్ము నీ ప్రేమ పూజలకు,
విడనాడి పోకుము, విఫలనై యెప్పు
డే ధూళి రాలి నశించి పోవుదునొ!

నీ వియోగమ్ములో జీవించు కంటె
చావు మేలగును నీ సంయోగ మందు
వెలుగువు నీవు, దివ్వెను నేను, దేవ!
అరినీలో లయమై పోదుగాక,

దేశమాత దరిద్రదీన దుస్థితికి
కన్నీరు నించిన కరుణాంతరంగ!
ఒక నిరాధార బాలికను త్యజించి
చక్కబోవుట నీకు సాధ్యమా, చెపుమ!

చెలియలికట్ట మించి, నభోంతరాళ
వీధులు ముంచు నా ప్రేమవాహినికి
ఆనకట్టను గట్టిగా నెంతు వేసెయు?
అవధిని జేరనీయవొ యేమొ దీని?

దేవుడవై నాదు జీవాలయమ్ము,
దేవాలయము జేసినావు నన్జేరి;
నీప్రేమ నీకెంతొ నాప్రేమ నాకు
నంత సమారాధ్యమౌ సుమ్ము, సఖుడ!

జడిపింప వలదు రక్షకభటు లంచు,
నరుని నరుండే మొనర్పగలండు?
మనుజుని శిక్షింప మనుజుని కేమి
అధికార మున్నదో అర్థము కాదు!

యోధుడవై యుండియును నీవుగూడ
భయపడనేల నీవంటి నరునికి?
భయముచేతనె కాదె బాధలు కల్గు?
అభయమ్ము దిగ్విజయప్రద మౌను.

శైశవమ్మున నాకు జనయిత్రి చెప్పె
వీరాధివీరుల విమల గాథలను;
దేశమ్ము కొఱ, కాత్మదేవత కొఱకు
ప్రాణమ్ము లడ్డిన ప్రాజ్ఞులగూర్చి.

నా జనకుండు నంతటివాడె యగుట,
పిలుచుకపోయినా రలట దేవతలు,
ఎదురు చూచుచు నుంటి నెప్పుడో వచ్చి
నను గూడ గొంపోవు నను నాశ తోడ!

ఇప్పుడే వత్తు నంచేగిన తల్లి
మరచిపోయిన, దింతవరకు రాలేదు;
ఎదుట నుండిన యపు డెంతెంతొ పొంగి
విడిచిపోయిన మీద నడగునో ప్రేమ!

మరచిపోతిని మంచి మంచి గాథలను,
వీరచరిత్ర లాధారముల్ భువికి,
వీరుడవై నీవు భీతిల్ల నేల?
కానిమ్ము, రానిమ్ము కాలాంత మైన.''

ఆ మనోహరి మనోహర వరవాక్సు
ధా రసామిత పానపారవశ్యమున
క్షణముండి, బోధిల్లి, గతగాథలేవొ
స్మృతికి రానాతడు చింతించె నంత;

''విప్లవోద్యత్కళా విద్యాగురుండు
నాకా మహాత్ముడు, నీకు జనకుడె?
దేశభక్తుడు, త్యాగి, ధీరుడా ఘనుడు
కాలమ్ము చేసెనో కారాగృహాన!

స్వేచ్ఛగా వాసంత సీమల దిరుగు
చిలుకను గొనితెచ్చి చీకటి పంజ
రమున రెక్కలను విరచి కట్టినట్లు
బందిఖానాలోన బంధించు టనిన.

ఏరీతి దలతువో కారాగృహమ్ము?
జీవితాశల పొట్ట చీల్చి, ప్రేగులను
కరచి, యువకుల నెత్తురు పీల్చి చంపు
రాక్షసీ; దాని గోరకు లేదు తృప్తి.

ప్రకృతిదేవీ గర్భ భద్రీకృతా వ్య
య ప్రభానవ్య దీవ్యచ్ఛక్తు లెల్ల
మిళితమై పుట్టిన మేధావు లెంద
రెందరో బలియైరి, ప్రియ! దాని క్షుధకు.

స్వాతంత్ర్య విమల తేజము లేని జాతి
కాంతి సోకని మొక్క కరణి నశించు;
స్వాతంత్ర్యముం గోరి సంగ్రామసీమ
చావు మంచిది సేవకావృత్తి కన్న

ధన్యురాలవు నీవు, ధన్యుడ నేను,
తండ్రిగా, గురువుగా తగు వీరు బడసి;
ఉత్తమ సంబంధ మూరక పోదు,
శక్తికి లేదు నాశన మెట్టి దశను.

మంచిది గా నింక, మారాడ కుండ
పోనిమ్ము నన్ను; నే పోయి నీ తల్లి
దండ్రుల కెరిగింతు తనయ క్షేమమ్ము
రావచ్చు నీ వెప్పుడో వీలుబట్టి.

జగమెల్ల నీవంటి జనులున్న యెడల
దారిద్ర్య మెందుకు? దాస్య మెక్కడిది?
నీనుండి జగమొక్క నీతి గైకొన్న,
ధన్యయై భాగ్యవంతము జెందుగాదె?

స్వచ్ఛ స్వభావముల్ పశ్వాది తతులు
నీనుండి ప్రేమను నేర్చుకో గలవు;
కిల్బిష హృదయుడు, కృత్రిమ జీవి
నరునికి గీడౌను తరుణి! నీప్రేమ.

పూవులు పూయించు పురుషోత్తముండు,
పూరుషు డవ్వాని పుడుకుచు నుండు
పాలించు నేడొక్క స్వార్థమే జగము,
స్వచ్ఛమౌ ప్రేమకు స్థానమే లేదు.

తడవిందు మసలుట తగదు నాకింక;
సెలవు నిమ్మో ప్రియా! సెలవిమ్ము చెలియ!
మాతృదేశ పదాబ్జ మంటప మందు
ఉంచిన బ్రతుకున కుపరతి లేదు."

అని తేచి, పోబోయి, అబలమోము గని
ధీరత సర్వము దిగజారి పోవ,
కాళ్ళు రెండును నేల కంటుక పోవ
సడలి, యాతడు కూలబడె నామె ప్రోల.

అబలయు, నార్తయు, ననురాగవతియు
నగు సుకుమారి నా యడవుల నొకతె
విడనాడి పోలేక, వెంటగొంపోవు
దారియు లేక యాతడు దురపిల్లె.

స్వేచ్ఛగా ప్రేమించి, ప్రేమించనుబడి,
పూజించి హృదయాన, పూజించనుబడి,
తానుగా కితరులు తనకు లేనట్టి
ప్రియమూర్తి నేరీతి విడిచిపోగలడు?

అసహాయశూరుడై, అరి విభూతా భ
యంకర క్రూర దావాగ్నుల బోవు
చుండి, యేవిధి దన సుకుమార సుమము
విసిరిపోగల డందు వెఱ్ఱివాని వలె?

చింతయ మూర్తి దాల్చిన దన నామె
చింతయమూర్తి దాల్చిన సఖుజూచి
కనుల నొత్తుకొని, యాతని కను లత్తి
గారాబముగ నవ్వి, యీరీతిబల్కె!

"ఎవరి జీవితమున కెవ్వరు కర్త?
కరుణాత్మ! ననుగూర్చి కన్నీరు వలదు,
కొదమ తుమ్మెద పొందు గోరిన పువ్వు
తోపలేని భరాన తునిగియు పోవు.

రత్నాకరుని గోరు రత్న మెంతైన
లోతులు తలపోసి భీతి నందెడునె?
మబ్బుల నర్తింప మనసైన మెరుపు
పిడుగుల గన్గొని వెనుకడు గిడునె?

కష్టాలనైనను, కడగండ్ల నైన,
పూర్తిగ బ్రతుకు నిప్పుల గుండ మైన,
మృత్యువునైన, ఆ మీదట నైన
జంట బాయక మను జంటయే జంట.

ప్రేమ పుష్పమ్ము పుష్పించును నిశిత
కంటకపూరమౌ గడకొమ్మ కొసను,
దాని నందగ దీక్ష పూనిన జీవి
కరములు రక్త సిక్తములైన నౌను.

నీలోన లగ్నమై, నాలోల హృదయ
మేలీల నైన నిన్నెడ బాసి మనదు;
అబలా హృదయ మిది, అతి కఠినమ్ము,
ననుబాసియైనను నిను బాసిది తీరు.

వర్షమ్ము కురియక వట్టి నే మబ్బు
లెన్ని పోవుటలేదు? ఎన్ని పుష్పములు
ఫలియింప నోచక పడిరాల విలను?
అణుమాత్రమేను బ్రహ్మాండమ్ము నందు.

ఎవరి జీవితమున కెవ్వరు కర్త?
కరుణాత్మ ననుగూర్చి కన్నీరు వలదు,
కష్టమో? సుఖమొ? దుఃఖమొ? ప్రమోదమ్మొ?
నేనె నా జీవితానికి బాధ్యురాల.

రమ్మోయి, మన కుటీరమ్మొక్కసారి
దర్శించి, తీసికొందము దాని సెలవు;
ఆత్మీయముల లోన నమిత ప్రియమ్ము
మధురాతి మధురము మాతృగృహమ్ము.

* * *

## ప్రస్థానము

మతి చలించిన రెండు మంచి తారకలు
ఉర్వికి దిగివచ్చెనో యన, నొకరి
వెంట నొక్కరు వారు ప్రియురాలు, ప్రియుండు
మౌనమ్ముగా నంత పైనమై వచ్చి:

వరవసంత లతాంత కరచామరముల
వలిగాలు లల్లన వనలక్ష్మివీవ,
సుఖముగా నిద్రించుచున్న లతా కు
టీరమ్ము గాంచిరి గారాబ మొలుక.

భూమాత ప్రక్కలో బురిటి మంచమున
ఊ కొట్టు చున్నదా యుద్యానవనము;
మంచంపు బందిటి మల్లెపువ్వు లన
వెదజిమ్ము గాంతులు వివిధ తారకలు.

పైకి పువ్వులు పూచి, పరమ మోదమ్ము
చేకూర్చు; లోపల చిట్టి చీకటిగ
భీకరమ్మై యుండు; లోకమ్ము తీరు
చూపుచున్నది వోలె నా పుష్పగృహము.

పద్మ గర్భమ్ములో భ్రమరమ్ము రీతి
అంధకార కుటీరమం దామె నిలిచి,
అభ్యుషః కిరణ మహస్సుకు బోలె
చెంతనో మిణుగురు చేదోడు కాగ.

లక్ష్మీ సరస్వతీ లాలిత యైన
భారతాంబ పటమ్ము భక్తిమై నంది,
పైట చెంగున దాని బరిశుభ్ర పరిచి,
ఘన మోదమున నిండు కనుల కద్దుకొని.

ప్రాంగణమ్ము్మను జేరి, ప్రణయాంత రంగ,
అంతరంగము పొంగి ఆయాస పెట్ట,
అంజలి ఘటియించి ఆత్మ మందిరము
గన్గొని యిట్లను గన్నీటి తోడ.

"నన్ను నీయొడి నుంచి నాతల్లి పోయె,
నేడు నీయొడి వీడి నేబోవు చుంటి;
రెక్కలు గొన్న గోరింక పిల్లవలె
పోవుచుంటిని నేను, దీవింపు మమ్మ.

నీ గర్భమున బుట్టి నీయంక పాళి
మెలగుచు, జీవించు మృగ శకుంతముల
హక్కులు కొన్నిటి నాక్రమించుకొని
బ్రతికితి నిన్నాళ్లు బహు నిరంకుశత.

మన్నింపుడో నన్ను మధువనప్రియులు,
మన్నింపుడో నన్ను మకరందపములు,
మన్నింపుడో నన్ను మంజు నికుంజ
ఖేల నాసక్త మృగీ సఖులార!

"ఇన్నాళ్లు మీ పండ్ల నే నేరుకొంటి,
ఇన్నాళ్లు మీ పూల నే గోసికొంటి,
ఇన్నాళ్లు నేను మీ స్వేచ్ఛావహార
సీమమ్ములెల్లను జేకొని యుంటి.

నా స్వేచ్ఛలో డిందె మీ స్వేచ్ఛయెల్ల,
నా సుఖమ్మున నీల్గె మీ సుఖమెల్ల,
నా స్వార్థ పరతలో మీ స్వాదుజీవ
నారామములు శ్మశానము లయ్యె నకట!

మీ పూలు త్రుంచువా రీపైని లేరు,
మిము బెదిరింపరీ మీద నెవ్వరును,
నేను పోవుచు నుంటి, నేటి నుండియును,
మీ స్వరాజ్యమ్మును మీరేలు కొనుడు."

అని, వన మెల్లను గనుగొని, యామె
కలుగ నుండిన వియోగము దలపోసి,
చిరకాల పరిచయ స్నేహ పాశములు
బలవంతముగ ద్రెంచు బాధ పొందుచును:

"ఓ మాతృభూమి! నీ నామ కీర్తనము
నాకు ప్రత్యుదయ సంధ్యా వందనమున
రాగమ్మై, విశ్వాంతరాళమ్ము నందు
గాన మై వెలయును గాక నిత్యమ్ము.

తనతోడ రావల దనుచున్న గాని,
చను చుంటి నీ వొసంగిన చెలి తోడ
మానుష ప్రేమ లతానిబద్ధనయి,
ఆశీర్వదింపు మోయమ్మ, నా తెగువ!

నీ వియోగమ్మును నేను భరింప
గలనొ? లేనో? విధిగతి యెట్లు గలదొ?
చేయాడ కున్నది సెలవు గైకొనగ,
అడుగాడ కున్నది విడనాడి పోవ!

ఆరామ మంతయు నవ్యక్త మధుర
సుఖనిద్ర నుండగ చోరు రాలివలె
వెడలి పోవుచు నుంటి నడిరేయి నేను,
ఏ మనుకొనునొ రే పామె మేల్కాంచి!

ఓ తమీ! తారలారా! తొగరేడ!
వన మాత మేల్కనువర కాగి మీరు
తెల్పుడీ నా స్థితి, నిల్పుడీ వగను,
సల్పుడీ పూజ నా జనయిత్రి కొరకు!"

సఖు హస్తమూని, యేక్షణమును దిరిగి
చూచుచు, పమిట నశ్రువు లత్తుకొనుచు,
ఆగుచు ప్రియమగు నాయా స్థలముల,
మ్రొక్కుచు క్రీడా సరోవరమ్ములకు,

ప్రతి చెట్టు దగ్గర, ప్రతి తీగ కడను,
ప్రతి పక్షి గూటను, ప్రతి జంతు గుహను
సెలవు గైకొనుచు నెచ్చెలి వెంట నడిచె
బిరువుగా, బెంగగా బంగారుబొమ్మ.

చంద్రబింబమునకు సఖులకు మధ్య
దట్టమై యున్నది, తరులతాదికము;
పరమేశ్వరునకును, ప్రకృతి దేవతకు
మధ్య నిల్చిన మాయమర్మమో యనగ.

విజ్ఞాన మను గాలి వీచిన యపుడు
ముసు గొత్తిగిల్లి కౌముది గోచరించు,
సమయాసమయ వివేచన బుద్ధి వారు
ముందు కేగుదురు ముముక్షువు లట్లు,

వలదు, పోవలదని వారించు నట్లు
పదముల కడ్డమై ప్రవహించు నచటి
సెలయేటి రెండు చేపలవోలె నీది
చేరి నా రద్దరి చెలు లొక్క దీక్ష.

అచ్చట గొంతసేపాగి, యా వనము
కడసారి సెలవును గైకొని వారు,
ఆ ముందు జూచి రయోమయ, మంధ
కార, మజ్ఞాతమౌ ఘోరకాననము.

తా మెరింగిన ప్రాత దారులు ముగిసె,
తామెరుంగని క్రొత్తదారులు వచ్చె;
వెనుక వెల్గును, ముందు ఘన తామసమ్ము
తమ నీడయే తమ్ము తడబాటుపరిచె.

సెలయేటి హృదయాన కిలకలువేయు
ఒక రసాలపుగొమ్మ నుపవసితులయి,
గడిపిరి వారొక్క గడియకాలమ్ము,
వెనుకముందులకు వంతెన గట్టుకొనుచు.

ఉన్నచోటున పిక మున్నట్టు లుండ
పాట దిగంతాల బయనమై పోవు;
కొమ్మపై గూర్చున్న కొమ్మ భావమ్ము
మాతృదేశ వనాశ్రమమ్ముల దిరుగు.

ఆతని మానస మరుగు ముందునకు,
వెనుకకుబోవు నా వెలది హృదయము,
రహి నయస్కాంత కరండ సంఘటిత
హస్తద్వయము వోలె నలరు నారెండు.

"మహాత్మ తా గాయమును వీడి, పరమ
ముం జేరుకొనియు, వ్యామోహమ్ము కాయ
మందెట్లు వీడదో, అట్లు నిన్ బంది
యును విస్మరింపకుంటిని మాతృభూమి"

అని ప్రియురాలన, నాతడిట్లనియె;
"సకియ! మాతృప్రేమ సహజమీ భువిని,
మాత, మాతృగృహమ్ము, మాతృదేశమ్ము,
వరుసగా ప్రేమ కావాసముల్ సుమ్ము!

ఒక తల్లి, నొక తండ్రి నొసగెద నీకు,
ప్రేమింపగల మాతృగృహము జూపెదను,
అందు సంరక్షితవై యుండి నీవు
చెలి! మాతృభూమిని సేవించగలవు.

నిశ్చింత నేను నిర్విమల కుటుంబ
రక్షిత జేసి, భారతదేవి పాద
సేవానుమతినయి పోవదలంతు,
హృదయమ్ము నీకడ నిడి వట్టి మేన."

దిగులుగా జూచి యా మగువ యిట్లనియె!
"చెలికాడ! ఏకాకి జేసి పోయెదవా
న న్నయో? ఎవ రెంద రున్నను గాని
నీవు లేకున్న నే నేల జీవింతు!

ప్రణయమ్ము మృదు పల్లవమ్ము, అద్దాని
విషము వియోగాగ్ని వేగింప నోప;
పల్లవించుట లేక వాడిపోవుటయొు,
నీ తోడిదే సుమ్ము ఈ తీగ బ్రతుకు.

"నెచ్చెలీ! నిను వీడి నే నెందుబోదు?
చంద్రుడు పోవునా చంద్రిక విడిచి?
మాటమాత్రమునకే మరి బెంగయేల
లె"మ్మని యాతడు లేపె నా తన్వి.

అంత వారిర్వురు నా కొమ్మ నుండి
దూకిన యూపులో గోకిలల్ రెండు
సణుగుకొన్నవి సుఖస్వప్నముల్ చెదరి,
పండుటాకులు రాలిపడినవి రెండు.

మూర్ఖుని మానసమో నాగ నడవి
దారి తెన్నులు లేక ఘోరమ్మై యుండె;
ప్రాక్తనపుణ్య సంపదల దోచు
నిట నొక్క మిణుగురు, నట నొక్క మిణుకు.

క్రాంత కల్పాంత లోక శ్మశానమున
కడగి పునస్సృష్టి గావించుకొరకు
పయనమ్మై వచ్చిన భారతీబ్రహ్మ
లన వారు చొరబడి రా కాననమున.

ఎండు డొంకలకు నిప్పిడి, వాని చుట్టు
గూడి గంతులు వేయు కోయ, లందందు
ఆ మహారాత్రి నిచ్ఛామతి నాడు
కొరవి దయ్యమ్ముల కరణిని జూప.

చీకట నడయాడు చీకు మన్కులకు
తెరువులు చూపెడు దీపమ్ము లనగ
పొదలలో మెరసెడి పులి కండ్లు గాంచి,
వడివడి నడలాగి పెడదారి గొనుచు.

ప్రక్కలుగల తమోహ్రదముల, నంబు
వుల నాడు నేస్నుగున్నల దప్పుకొనుచు,
గురువెట్టి నిద్రించు క్రూరమృగేంద్ర
గుహలప్రమత్తత గుర్తించు కొనుచు.

అటనట వనమెల్ల పిటపిటలాడ
దరికొని మండించు దావాగ్నితోడ
ప్రాంతమెల్లను పట్ట పగలుగా వెలుగ
తెరువులు గుర్తించి బిరబిర జనుచు.

తద్విపత్తున బడి, తహతహ పొంది,
చెట్టుకు బుట్టకు జెదరి పర్వెత్తు
మృగ, మృగరాజ, పన్నగ, ఖగాదులకు
తత్తర మందుచు, దప్పించు కొనుచు.

అందందున మకాములందు గాన్పించు
పులులను బోద్రోలు పాలికేక లన్నో
వినుచు, పరీసర ఘననికుంజముల
భయద గర్జల కుల్కిపడుచు, బర్విడుచు.

పోవు మార్గమ్ము లపూర్వమ్ము లగుట
తిరిగిన చోటనే తిరుగుచు వారు,
ఒకయెడ మిన్కు దీపిక నొండు గాంచి
గుర్తుగా దానిని గొని సాగినారు.

దారి తెన్నులు లేని ఘోర శర్వరిని
దుర్బలచిత్తు డేదో యొక వెల్గు
నమ్మి ముందుకు సాగు; నది సాదరంపు
సదనమౌ గాక, శ్మశానమౌ గాక!

వేవేగ సాగి, యా విజన సీమమ్ము
గడిచి, జనస్థాన కద్రుమవాటికను
దరిసి, యాతడు కాంచె తత్తరపడుచు
రాత్రించరుల బోలు రక్షక భటుల.

అంధకారము దెచ్చి యట రాశిపోసి
రో యను నొక్క మట్టి యూడకు చిన్న
కాచ దీపము ద్రేవగట్టి యాక్రింద
మంచెలపై మేను మరచిన భటుల;

కన్గొని, క్షణములో కాంత నెత్తుకొని
మారు దారిని మాయ మయ్యె నతండు;
పులిగాంచు నపుడైన పుట్టని భీతి
మనుజుని జూచిన మాత్రాన గలచె!

తత్క్షణమతని స్వాంత ప్రపంచమున
ఉదధి ఘూర్ణిల్లెను, ఉప్పెనపొంగ,
కల్పాంత కాల మేఘము లావరించె,
పిడుగులు రాలెను, బీభత్స మయ్యె.

కంటికి వెలుపల, కంటికి లోన
అంధకారార్ణవ మయ్యె నాతనికి;
ప్రత్యూషమును దెల్పు పక్షులే లేక
కాలమాన మెరుంగ గష్ట మా వనిని!

ఏదిక్కు నడిచెనో, ఏదారి గొనెనో,
చొచ్చెనో లోనికి, వచ్చెనో కడకు,
తెలియదు; సందు గొందుల నెల్ల దాటి
తెల్లని తూరుపు దిలకించె నతడు.

గాఢ ప్రళయరాత్రి గర్భమ్ము నుండి
వెల్వడు నూతన విశ్వమ్మువోలె
రమణీయమై ప్రభాతము వచ్చెనంత
శ్రమజీవులకు శుభ స్వాగత మీ్మయ.

గూకిన రవితోడ గూకిన యతని
హృదయమ్ము పొడిచిన ప్రొద్దుతో బడిచె;
ఆమధ్య గలది గాఢాంధకారమ్ము,
తెలియ దెవ్వరి కందుగల రహస్యమ్ము.

తమి దమస్విని ముద్దుతనయ నుషస్సు
బ్రేమించి, మిత్రుడు వెన్నాడ, నామె
దోబూచు లాడుచు దూర్పు కొండలకు
పర్విడి వచ్చి యా ప్రాంతాల మసల.

ప్రేయసికై తమో వీధులు వెదకి,
పర్వత దుర్గాల పరిఖాళి గడిచి,
భిత్తికల్ పడగొట్టి బీభత్సపరచి,
రక్తపాతముల జేసి, రాజును గెల్చి.

రవి తేజరిల, తమో రాజ్యమ్మునందు
అరుణ రక్తప్రవాహములు దిగంత
ములు ముంచి, ప్రవహించి నిల కనునట్లు
అల వేయ సాగె సంధ్యారాగ మపుడు.

ముందుషస్సును, వెన్క మోహపథ ప్ర
యాణ వేగశ్రాంత మానసు డగుచు
వడిజను బాల భానుడు నెదురైరి
ఆత్మ దేవత గొంచునతడేగు దారి!

ముకుళమ్ము పగిలి, సంపుల్ల పుష్పమ్ము
వెలువడు నట్టు లా విమల ప్రభాత
గర్భమ్ము వెల్వడి కమల బాంధవుడు
ధాత్రిని రంజించె నేత్ర పర్వముగ.

శత సూర్యకర సహస్రానీత రత్న
కంకణ భూషణాలంకృత లైన
సారస సారసాస్యలు లాస్యకేళి
ప్రాతర్నమోనమః ప్రణయ భంగిమల;

ఆత్మేశు నర్చించునట్టియా రమ్య
కాసారమును గని, కాంతను దింపి,
హృదయమ్ము వికసింప, వదనమ్ము వెలుగ
తామరాకులు తెచ్చి, తన్వికి బరిచి.

అలసట తీర సుఖాసీన జేసి,
తలిరాకు దొన్నెతో దప్పిక దీర్చి,
తాను గూర్చుండి, తగ నిట్టు లనియె
దిక్కులు గనుగొంచు, పక్కన నతడు.

"బ్రతుకును విడనాడి బ్రతుకును మరల
గొంటిమి మృత్యూగ్రఘోరాబ్ధి గడిచి;
చెలియ! నా మాటను జెవి బెట్టకుండ
అనుసరించిన సుఖ మనుభవించితివె?

అక్కటా! సుకుమారమ్మైన వల్లికను
పూచి, వాసనలిచ్చు పువ్వును పుడికి
తెచ్చి, నే నిందందు ద్రిప్పెద; నేమి
చేయుదునో యంచు జింతింతునెడద.

రమణి! ఇంకెంత దూరమొ లేదు మనము
పోనున్న గ్రామము, పోదము వేగ;
ఈ పండ్లు రుచిచూడు మెక్కువ పండ్లు
గతి వేగమున కోయగా జాలనైతి."

అనునంత, నామెయు నలసట యుడిగి
మోము నాతని భుజమున మోపి పలికె:
"సర్వము నెదిరించి చనునీకె గాక
నీ వెన్క వచ్చు నీ నీడకే బాధ?

స్వేచ్ఛగా విహరించు సింహ కిశోర
మునకు నే గొలుసు నైతిని, చెలికాడ!
ఆకాశమున హాయిగా కేళిసల్పు
పక్షికి నే గాలివాన నైనాను,

పూవు పూవుకు బోయి పూదేనె గూర్చు
నలికిని, విశ్వ రహస్యములందు
శ్రమియించి ప్రేమమ్ము సమకూర్చు కవికి
అడ్డమేగుట అఘమార్జించు కొనుట.

ఎందుకోయీ సఖా! ఈ గూఢ జీవి
తము? మాతృదేవీ పదార్చనమ్మునకు
కల్పింపు మొక మంచి కార్యక్రమమ్ము
ఇర్వురమును నిర్వహింతము దాని.

ప్రాణేశునకు గల బాధ్యతలందు
సగబాలు పంచుకో జాలని యువతి
ప్రాణేశ్వరిగ నుండగా నర్హగాదు,
అర్ధాంగి యనుమాట కర్థమే లేదు.

ఈ సరోవరమున నీదాడి, ధౌత
చింతామలీమస స్వాంతాంబుజముల
ఆ నగమ్ముల నెక్కి, సానువాటికల
విహరించు కొనుచును వెడలుద మింక.

అందున గల్గు గుహాంతర మంది
రములలో వసియించెదము స్వస్థచిత్త
ముల, నిట్టి క్లేశసంక్షుభిత శర్వరులు
గడుపగా లేమెంతో కాలము మనము.

బాహాటముగ దావిబరపని పూలు
పుట్టగా నేలను పూగొమ్మ విరుగ?
పంచమ స్వరమున పాడుకో లేని
పిట్టకు నేలను పికమను పేరు?

రత్నగర్భము నుండి రచ్చకు వచ్చి
గులకరాలను జేరుకోనేల? సఖుడ!
తారాపథమ్మున తావులేదేని
మాతృగర్భము లేదె మనల నోదార్ప?

ఈ దృశ్య మెప్పుడో నే జూచినట్లె
యగుపించు, పరిచితమ్మై నట్లె తోచు;
చేరి జన్మాంతర స్నేహమేదేని
ఉల్లమ్మునకు దాకుచున్నదొ యేమొ!

* * *

## పరమావధి

కొంచెపు దూరాన కొండలు రెండు
ధరణీ సతీ భుజద్వయ మన నొప్పు,
తన్మధ్యమున మణీ తారా మనోజ్ఞ
హారమో? యన సెలయే రొండు పారు.

ఆ స్వర్ణ తారకాహారమ్ము నడుమ
మాంగల్యమన నొప్పు శృంగార సురుచి
రాబ్జాకరమ్మది ఆనందకరము
పృథివికి బరమేశు బ్రేమ చిహ్నముగ.

సల్పిరా సరసులా సరసీ జలాల,
అబ్జహారముల కబ్జాహారములకు
ఉన్నభేదము లేశమున్నీట ద్రోసి,
ఆహ్లాదమున రాజ హంసలై కేళి.

వడి బారు వర్షా ప్రవాహమ్మునకును
మత్స్యమ్ము లెదురెక్కు మాడ్కిని వారు
ఒక్కొక్క తరగపై కురుకుచు వేగ
నెదురీతతో ముందు కేగిరి కొంత.

ఈదాడు చేపల నెత్తుక పోవ
వేచియుండిన డేగ విధమున నున్న
చందమామను గొట్ట సాయత్తుడైన
వేటగాడన రవి వెలసె నా ముందు.

సర్వార్థనిధియైన స్వామికి నిత్య
మభిముఖ యాత్రికు లౌ జీవు లట్లు
అభిముఖులై సాగి రానంద వికచ
హృదయాబ్జముల నబ్జ హృద్రంజకునకు.

అట్లు వారీదుచు నరిగెడు నపుడు
ముం దాతనిం గాంచి మోహిత యైన
పద్మిని వెన్క నా పర్వేందుముఖిని
గని సిగ్గుపడి వంచుకొనియెను మోము

చెల్వ కైదీవల స్నేహమ్ము గోరి
వచ్చి, నవ్యమృణాళ వల్లికాసఖులు
ఉరుకేళిబల్చెడు నూరు తుండముల
జూచి నిరాశచే జచ్చిరి కడకు.

నవరత్న సంస్నిగ్ధ నవ్యేంద్ర ధనువు
ఆషాఢమాస ప్రత్యూషమ్ము కొరకు
సానలు దేర నా సరసీసరోజ
దళముల రాపాడి తళుకొత్తుకొనెడు,

చైతన్య మొంది, యాసరసుల నొరసి
నెరసులు వారుచు నీరజేశ్వరుడు
నీరజ మధు బిందు నికరమ్ము లనగ
మిరుమిట్లు గొల్పు నాయరుణోదయమున.

స్త్వైచ్ఛ, మాతృవక్షస్సీమ బ్రాకు
కవల బిడ్డల బోలె కాంతయు, నతడు
సెలయేటి కెదురీతి, చేరి రారెండు
కొండల గుండెయౌ బండనోదాని.

రాత్రి యెల్లను పడ్డ శ్రమనెల్ల మరచి
కాలాని కెదురీతి గట్టెక్కినట్టి
దిన దినేశుల వోలె తేరి, యా చెలులు
క్షణకాల మందు విశ్రాంతి గైకొనిరి.

"ఈ పర్వతశ్రేణి కాపక్క నొక్క
క్రోసులో గలదొక్క కోయగూడెమ్ము;
పొలతి! అచ్చటి స్త్రీలు, పురుషులు చాల
మానవత్వమ్మున్న మనుజులు సుమ్ము.

దాసత్వమునకును, దౌర్జన్యమునకు,
పాపమ్మునకు వారు పాల్పడ రెపుడు;
స్వార్థమే పరమార్థ మనుకొను నాగ
రకులతో సుంత వారికి లేదు జోలి.

నమ్మిన బంటులె నాకు వారెల్ల,
ఆదరింతురు నిన్ను ఆనందపడుచు;
పోవుద మచటికి ప్రొద్దుండగానె
లె''మ్మని యాతడు లేమను లేపె.

తరతరాలుగ నిట్టి తరహాలు చూచి,
చూచి, చూపులపూలు పూచిన యొక్క
వృద్ధ కింశుకమును వీక్షించి వారు,
దాని క్రీగొమ్మపై దేనినో కాంచి,

సెలయేటి కిరుగట్ల చెప్పుకోరాని
రకరకమ్ముల చెట్లు రంగారుచుండ,
రంగురంగులపూల రాసుల ముసరి
మేఘాలరీతి తుమ్మెదలొప్పుచుండ,

మెరుపుల మేఘాల మరుగుల లోన
తమి నోలలాడెడు తారాశశాంకు
లట్టు లాయిర్వురు చెట్టును జేరి
పూలతో పాటుగ పుడికి రద్దాని.

కరచుకొన్నది మధుకర మౌడు నపుడు
గొంతుక సవరించుకొన్నది పికము
వేణువనమ్ముల విహరించు గంధ
వహ మేదొ పాటము వల్లించుకొనియె.

సుమనోవసంతికా రమణీయచరణ
చారణమౌ రహస్యమ్మది యేమొ!
ఖంగుమన్నది వాణి బంగారు వీణ
ఘల్లున ప్రకృతిరంగము మ్రోసినంత.

నలుసేని, జ్ఞప్తి చిహ్నామ్మైని సుంత
కన్నుల బడినంత గన్నీరు వచ్చు;
ఆమయ బాధా మలీమస మొక్కటి,
కోమలభావ పరిమళ మొక్కటి.

ప్రత్యుదయాదిత్య పరిసేవ్యమాన
పారిజాతమె కాదు, పల్లె పొలాన
పూరింటికడ బంతిమొక్కయు పూచు
కారణమ్మొక్కటి కార్యముల్ వేరు.

భూతకాలపు లోతు లోతుల నెంత
పంకమున్నను పైకి పద్మాలు పూచు;
ప్రత్యూష ముదయించు ప్రగతిగర్భమున,
ఆనందమునకు పునాది దుఃఖమొకో?

చేతనందిన నగ చేతనే యుండ
హృదయాలు పగులిచ్చి యేడ్చిరి వారు,
ఎవ్వరి హృదయమో, ఏనాటి గాథో
త్రవ్వి యెత్తిన దది త్రవ్వుకోల వలె!

తన తల్లి మాంగల్య మని యామె పలుక
తన తల్లి మాంగల్య మని యాత డనియె;
శోభాకర స్వర్ణ సూత్ర సంబద్ధ
మాంగల్య మది ప్రేమ మధుమందిరమ్ము.

తమ మాతృమూర్తు లిద్దరు రాజకీయ
బాధితలే, కుటుంబములను దేశ
స్వాతంత్ర్య దేవతా చరణ పీఠమున
కర్పించి పోయిన త్యాగినీమణులు.

ఒక తల్లి సుతుడు వేరొక తల్లి సుతయు
అడవి యుసిరికయు గడలి యుప్పునుగ
నేడొక్క సూత్రాన జోడింప బడిరి!
నేడొక్క రసములో నిర్వృత్తి గనిరి!

భద్రా చలాటవీ ప్రాంత గోదావ
రీ రీతులరయు సీతారామ భద్రు
లే నాడు గన్పింప కెందు బోగలరు
దారి గాచెడి రామదా సొక్కడున్న?

ఆకారముం గొనినట్టి మహాత్మ
తేజమో యన నొక్క దివ్య మునీంద్రు
డంతలో ప్రత్యక్ష మయ్యె నయ్యెడను,
పరవశులై వారు ప్రతిమల ట్లుండ.

ఉద్భవించిన పూల నుత్తమమ్ములను
మునిపూజ కోసమే ముప్రొద్దు రాల్చు
వన మంత తనకు దా వచ్చి యావేళ
స్వయముగా నొసగె సర్వస్వమ్ము బ్రీతి.

ఆ తపోధనుని పాదార విందములు
శిరములు సోక వా రిరువురు మ్రొక్కి
కర కమలమ్ములు ఘటియించి నిల్వ
ఆశీర్వదించి యా యతి లోక నియతి;

అలరు బంగరు తీవియల సెజ్జ నుండి
పూలు రెండెత్తి, యిర్వురకు నొసంగి
సజలాక్షుడై యొక్కసారి తద్వదన
పద్మముల్ గని సాగె వచ్చిన దారి.

తెగువజేసి, యదృష్ట దేవత జాడ
గనిపెట్టి వెన్నంటు గడసరుల్ వారు
ఊర్ధ్వదృక్కుల తోడ, నున్న తాధ్వముల
ముని పదచ్ఛాయల ముందుకు జనిరి.

ప్రతిజీవి జీవితాధ్వములోన నెపుడు
అడుగడుగున నొక్క యవకాశ ముండు;
పైకిపోవునొ, క్రిందికే కాలు పడునొ,
క్షణముహూర్తమ్మదే శతమాన ఫలము.

చీకటి ప్రాకుల చిమ్మచీకట్ల,
తీవజంపమ్ముల త్రోవల బోయి,
ఒక బండదీసి, వేరొక బండ ద్రోసి
ఏర్పడ్డ బిలమున నేగిరి వారు.

అదియో నిగూఢ గుహాంతర మంది
రాధ్వమ్ము, తచ్ఛిలాప్రాంతమ్ము లెల్ల
లలితాచ్ఛశిల్పకళా శోభితములు
స్వాతంత్ర్య సమరకేళీ తాంత్రికములు.

అలనాటి దేవాసురల పోరు మొదలు
మొన్న సిపాయీల మొదటి స్వాతంత్ర్య
కదనమ్ము వరకును గల గాథ లచట
రాతిలో మలచినా రజరామరముగ!

ఆ వ్యూహరీతులు, నాయుద్ధగతులు
కళ రూపమున జూపగలవారు లేక
ఊరక పరువెత్తె నుత్తరు డడలి,
పాపము కడతేరె బాలచంద్రుండు.

శయ్యాగృహమ్మున, సంగ్రామసీమ
మగటిమి గలవాడె మానితు డవని,
మహినెల్ల నొక యిక్షు మధుర ఖండముగ
కళగాక చేకూర్ప గల దేది లేదు.

ప్రకృతి సిద్ధము లైన ఫల ధాన్యములను
ఆహారముగ జేసి యమరుచు నట్టి
పచన కారుని వోలె, రచన కారుడును,
వెలయించు చుండును కళగా ప్రకృతిని.

సృష్టికి ప్రతిసృష్టి శిల్పమ్ము, కాన
బ్రహ్మ కన్నను కళా బ్రహ్మ పై వాడు;
శిల్పమ్ము ననుసరించియ పోవు సృష్టి,
పరిణామ పథములో నరుడె ముందడుగు.

చూచు కొలందిగ సుందరమ్ములయి,
ఊహించు కొలదిగ నుజ్జీవ మొంది,
పల్కరించెను వారి, బ్రశ్నించె జేరి,
జీవితార్థము గోరి శిల్ప ఖండములు.

జడ జగత్తును వీడి చైతన్యమునకు,
చైతన్యమును వీడి జడ జగత్తును
ప్రతిమలు, సఖులును పయనమ్మై నడుమ
అన్యోన్యతను గూడి, ఆనంద మొంది.

మానవాతీతమౌ మధుర గేయముల
భాషించు కొనుచేగి, పరికించి నారు,
రహి నజంతా వంటి గుహ నొక్కదాని,
మయుని కళాభ్యాస మందిర మ్మనగ.

బుద్ధుడు సంసారమును వీడి పోవు
చుండి భార్యను సోకి సోకని రీతి
ముద్దిడు చున్నట్లు దిద్దగా బడిన
శిల్ప మొక్కటి ప్రక్క శిథిలమై యుండె.

పారతంత్ర్యపు పాము పడగల నీడ
మండూకమై యున్న మాతృ దేశమ్ము
కార్చిన కన్నీటి కడలి గర్భమున
నాచు గట్టిన దొక్క నవ్యభావమ్ము.

అద్దాల మేడల నపరంజి పళ్ళె
రము నుండి యెత్తెడి ప్రతిముద్ద పైకి
క్షుత్పీడితుల కోటి చూపుల బాణ
ములు లేచె, నది నిజమో! శిల్పితనమొ!

ఆ కళాదేవత యడుగుదామరల
ప్రక్క నాసీనుడై పరమేష్ఠి వోలె
ముని యామె, నాతని ననురాగ మొలుక
దక్షిణ వామహస్తముల గ్రహించి.

చెరి యొక్క ప్రక్కను చేరిన చెలుల
దీసుక కొత్త ఖాదీ దార మట్టు
లున్న గాత్రమ్మున కొదవించు కొనియె
వారి పరీరంభ భారమ్ము నపుడు.

బోసి నోటను బుట్టు హాస ప్రభాస
చంద్రిక తెల్ల మీసాల మేఘాలు
వెల్వడి గడ్డపు వెండికొండలను
గాయగ నవశరత్కాలమో యనగ;

నెగడు నా వృద్ధుని నేత్రమ్ము లనెడు
అమరతటాకమ్ము లందుండి మేఘ
ములజచ్చి, నగశృంగముల రాలి మెరసె
బాష్పమ్ములను సుధావారికణాళి.

ఆ గురుదేవు డట్లను కంపితాంగు
డై, యామె కెంగేలి నాతని హస్త
మున నిడి పల్కెను, భూధరసాను
నిమ్నగా గంభీర నిస్వనం బడర.

"ప్రేమించు కొనిరి మీ రిర్వు రొండురుల,
ఎడబాయకుడు మీర లే పరిస్థితుల;
పృథ్వి నేదియు లేదు ప్రేమను మీరి,
ఆరాధనమె ప్రేమ కతి సూటి దారి.

మనసు నొక్కెడ నిల్పుకొనలేని జీవి
అందుట కష్టమౌ నద్వైత సిద్ధి;
తుది మోక్షమున కిది తొలిమెట్టు గాన
ప్రణయ దైవతము నారాధించు కొనుడు.

ప్రకృతి యనేక రూపముల సేవించు
ప్రణయ పుష్పమ్ముల పరమేశు నొకని,
పరమేశు డొక్కడు ప్రణయమ్ము నెరపు
ప్రకృతి యనేక రూపమ్ముల తోడ.

పరమేశు డొక మహాపార నీరనిధి
ప్రకృతి యనేక నిర్ఝరిణీ స్వరూప;
రూపభేదమ్మింత రుచిభేదమింత
సమసిన నొక్కటే శక్తిగా మిగులు.

మధుమాస మధురాగమము వేళ నీవు
మా యింట జన్మించి మధుబాల వైతి;
సర్వమానవ సమాజము నింక మీద
మధుమాసముగ జేసి మనుమమ్మ తల్లి!

నీవు నూత్నసమాజ నిర్మాణమునకు
కర్త గావలెనని గౌతము డనుచు
పేరిడినారు నీపితరు లో తండ్రి!
వారి కోరిక దీర్పవలె జుమీ యింక.

అనుభవజ్ఞుడ గాన నభిలాష దీర
మీకొక్క యుపదేశ మిచ్చి పోయెదను;
వేదాంత మని నవ్వి వేయగా వలదు
వృద్ధుని మాటగా వృధజేయ వలదు.

పక్వమ్మునకు రాని పచ్చి కాయలను
కావుగట్టిన క్రుళ్లిపోవె? ముగ్గెడునె?
ఏరైన పడని యెడారిలో నెంత
మొండి విత్తన మైన మొలకెత్త గలదె.

మానవ సంఘ నిర్మాణమ్ములోన
ప్రథమ సోపానమ్ము పశులోక మందు,
తుదిమెట్టు విపుల విద్యు ల్లోక మందు
గలవు, ఈ మధ్యలో గల వెన్నొమెట్లు.

పశు లోక మందుండి పరమాత్మ వరకు
అన్ని మెట్టుల మీద నున్నారు ప్రజలు,
కొలబద్ద చదువును, కులమును, ధనము
గావు; ప్రమాణమ్ము కరుణ యొక్కటియె.

స్వేచ్ఛా నవోదయ శ్రీ మందహాస
కాంతిరేఖ రవంత కనుగొన్నవాడు
పూర్ణోదయము గోరి పోవునే గాని
విముఖుడై యంధకారము గోరి చనడు.

మౌఢ్యాంధకారాబ్ధి మగ్నమైయున్న
పామరలోకపు ప్రజలకు నెల్ల
అరుణోదయపు గాంతి నావంత బరపి
అనఘాత్మ! చూపింపు మయ్య పై మెట్లు.

ఆ మెట్లు కనబడునంత తమంత
నెక్కివత్తురు ప్రజలే జాగు లేక;
అందరు పై కెక్కు నంత దనంత
గల్గు కళ్యాణమ్ము, కల్గు శోభనము.

కోయిలలును, గుడ్లగూబలు గల్గు
సంఘమ్ము నందేటి సామరస్యమ్ము
స్వాతంత్ర్యమధుర వాసంత శీధువుల
గోరెడు రుచిని చేకూర్పు మందరికి.

దేశచరిత్రలు తిలకింతు వేని
జరిగిన రణమెల్ల స్వార్థమ్ము కొరకె,
అధికార మందు నీకాశ లేకున్న
గైకొమ్ము నిర్మాణ కార్యక్రమమ్ము.

పాలు పట్టని లేత పైరును గోయ
సిద్ధమై, వ్యర్థమై చెడనేల రైతు?
ప్రజలెల్ల స్వాతంత్ర్య పథముల రాక
విశ్వశుభోదయ విప్లవమ్మెట్లు?

విమల విజ్ఞాన దీపికలను దాల్చి,
అజ్ఞాన తిమిరమ్మునందు నల్లాడు
స్వార్థజీవులకెల్ల పై మెట్లు చూపి
ఒక్కొక్కమెట్టుగా నెక్కిరానిండు.

మానవ కారుణ్య మను నొక్కగుణము
విశ్వ సౌభ్రాత్రము వెలయించగలదు;
స్వార్థమ్ము వీడిన చాలు, మానవుడు
దేవుడౌ, జగమెల్ల ధన్యమౌ నంత.

అవినీతి పెరిగిన దవని నెల్లెడల
క్రమశిక్షణమె లేదు కాంచు డే బ్రతుకు;
పరపీడనమ్మును పారతంత్ర్యమ్ము
దారిద్ర్యమును నేడు ధరణిబాలించు

. కలదొక్కటే దీని కంతకు మందు,
సర్వోదయ సమాజ సంస్థాపన మది
గాంధీ మహాత్ముని కలకు రూప మది
మానవ పరిణామ మందొక్క మజిలి.

బ్రతికి యుంటిని మీరు వచ్చెడి దాక
ఆయుస్సు చెల్లిన దవనిపై నాకు
ఆనందమున మీర లరుగు డిందుండి
దేవతలకు బోలె జీవింత్రు గాక.''

ప్రమిదె మిగులును దీపం బారు వెన్క
ఆత్మయును పరమాత్మయుం దైక్య మైన
వెనుకను దిక్కుమాలిన దౌను తనువు
దారము తెగినయంతన రాట్న మాగు

జరిగిన దేదియో చపలాక్షి కర్థ
మే గాక కలగె, దుఃఖించె నాతండు
దీప మారిన మీద తిమిరమ్ములోన
నూపి రాడని పసిపాపని రీతి.

"తన రాకతో ప్రభాతముదెచ్చు పూవు
అర్థనిశీథము నందె తున్గునొకో?
తన పాటలో వసంతము నించు పికము
వడి లంగరెత్తునో వైశాఖ మందె?

మాతృదేశాదర్శ మకుటమ్ములోని
రత్న రాజమ్మొండు రాలి పోయినది,
భారతదేవతా పాదసన్నిధిని
అగ్రదీపంబొక్క టారిపోయినది.

పూస పోయిన దారమును బట్టి చింత
నొందగా నేలను, సుందరీ, లెమ్ము!
చీకటి తెరజింపు సిద్ధి నీకున్న
ఈశ్వర తేజమ్ము నీక్షింపగలవు.

నిన్నను విడనాడి నేడెట్లు వచ్చె
నేటిని దిగద్రోచి నిల్చును రేపు;
తన్వి! మానవ జీవిత చరిత్ర లోన
త్రిప్పిన పుట మరి త్రిప్పగా లేము.

పగలు కావలసిన పని కాక ముందె
అస్తమించుట భావ్యమా భాస్కరునకు?
భాస్కరునకు బోలె పని పూర్తిచేయ
నీ తండ్రి రేపుదయించునో యేమొ!

కాలము భగవదాకారము క్షణము
క్షణము దుఃఖోపశాంతిని గూర్చు చుండు
కర్మవశత రాలు కారాకు లందు
నంకూరములు పెంచి యానంద పరచు

తెరపి లేకుండగ తిరిగెడు విశ్వ
రాట్నాన జీవసూత్ర మ్మేల తెగును?
ఒకయేకు ముగిసిన, నొకయేకుబట్టి
విరతి నెరుంగని విధి సాగి పోవు.

ఎక్కడో గుర్రపు డెక్కల చప్పు
డ్లై, తెప్పరిలి, యాత డటు, నిటు నడిచి
అతిగోప్యమౌరీతి నద్ద మమర్ప
బడిన రంధ్రము నుండి ప్రాంతమ్ము లరసి.

భటు డొక్కడాదారి బడి పోవు చుంట
గన్గొని, యోచించి, గౌతము డంత
మతిలేని యట్లున్న మధుబాల లేవ
దీసి "స్వస్థపుగమ్ము దేవి, యిం" కనుచు

గుహనెల్ల నామె కన్గొన ద్రిప్పి, అందు
సమకూర్పబడియున్న సకలాయుధముల
గాంచి ,యచ్చెరువంది, కన్నులు చెమ్మ
గిల నొత్తుకొని కాంత కిట్లనె నతడు!

"భారతమాత నిర్భాగ్యదాస్యమ్ము
వాపగ సమకట్టి, బ్రతుకెల్ల గడిపి
పుడమి భక్తు డొకండు పొందిన ఫలిత
మీ యగారము పూజనీయము మనకు

ప్రజ లంద రక్కరపడి కోర రేని,
ఆయుధమ్ములు తెచ్చునా స్వరాజ్యమ్ము?
కత్తికి ప్రాణము కలదేని, అది యె
లోకాహితము తృటిలో గూల్చి యుండు.

ఈ యతి మహనీయు, డీతని యాజ్ఞ
నిర్వహింతము లెమ్ము, నీరేజ వదన!
పల్లె పల్లెకు బోయి, ప్రజలకు నెల్ల
స్వాతంత్ర్య దీక్ష నొసంగుద మింక.

ఎవ్వ రొసంగుదు, రెవ్వరు కొందు
రే, బాల? స్వాతంత్ర్య మెవ్వరి సొమ్ము?
తను దాన గుర్తించుకొనుటె స్వాతంత్ర్య,
మాత్మ విశ్వాసమే అభ్యుదయమ్ము.

క్రమశిక్షతో పరిభ్రమియించు విశ్వ
గోళమ్ములో నొక్క గోళీ నటంచు
ప్రతివాడు గుర్తించి బ్రతికిన నాడు
మనుజుల బాధలు మాయమ్ముకావె?

విశ్వ జీవనఝరీ విపుల ప్రవాహ
గతి బోవుచుండి సంఘర్షణ మేల?
గతి కడ్డమౌ వారికణ మెల్ల పగిలి
పడిపోవు చుండును ప్రగతి మార్గమున.

తన మృత్యువు తన చేతన గల్గు జాహ్న
వీ తనయుని వోలె నీ తండ్రి నేడు
కర్తవ్య బోధను గల్గించె మనకు,
గురుని కోరిక దీర్ప తరుణి లెమ్మింక."

అంతట వా రా గుహాంతర మందు
గల వస్త్రముల నెల్ల గలయంగ వెదకి,
యౌచితి పాటించి, యాకార మెరిగి,
తగువానిగొని వేషధారణజేసి.

ఆ గురుదేవు సంత్యక్రియల్ తీర్చి,
గుహ బిలమ్మున నొక్క గుండ్రాతి నుంచి,
సాష్టాంగపడి లేచి, సర్వేశ్వరునకు
త ద్రక్షణంపు బాధ్యత నప్పగించి,

మానవ లోకమ్ములోని కిర్వురును
విమల చిత్తమ్ముల వెడలినా రంత,
స్వాతంత్ర్యదీక్ష నొసంగుట కొరకు,
స్వారాజ్య మొక్కట సాధించు కొరకు.

ఉదయ తారక తోచె నుదయాద్రి మీద,
పరభృతమ్ములు లేచి పాడదొడంగె,
భువి నవభారతాభ్యుదయమ్ము రీతి
సూర్యోదయ మ్మయ్యె, శోభించె జగము.

* * *